
ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
22-01-2025
బుధవారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 129 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి



2 లో

# అమెరికాలో పుట్టినా ఇక కష్టమే..

## యూఎస్ పౌరసత్వ నిబంధనలు కఠినతరం

- అమెరికా అధ్యక్ష పగ్గాలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన వెంటనే కీలక సంస్కరణలు చేపట్టారు. అమెరికా పౌరసత్వ నిబంధనల్లో కీలక మార్పులు చేపడుతూ ఉత్తర్వులపై సంతకాలు చేశారు. తాజా నిర్ణయంతో ఇక పై అమెరికా పౌరసత్వం లభించడం మరింత సంక్లిష్టం కానుంది.

అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ ఆ దేశ పౌరసత్వం విషయంలో కీలక ఉత్తర్వులు జారీ చేశారు. అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన వెంటనే పలు కీలక నిర్ణయాలపై ట్రంప్ సంతకాలు చేశారు. మాజీ అధ్యక్షుడు జో బైడాన్ నిర్ణయాలను రద్దు చేశారు. ట్రంప్ నిర్ణయాల్లో యూఎస్ పౌరసత్వంపై కఠిన ఆంక్షలు విధించారు.
అమెరికా పౌరసత్వ జారీ చేయడానికి ఉన్న విధివిధానాల్లో కూడా మార్పులు చేస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై ట్రంప్ సంతకాలు చేశారు. తాజా నిర్ణయంతో ఇకపై అమెరికా పౌరసత్వం లభించడం సంక్లిష్టం కానుంది. అమెరికాలో శాశ్వతంగా స్థిరపడటం కఠినం కానుంది. తాజా నిర్ణయం ప్రకారం అమెరికాలో జన్మించే వారి తల్లిదండ్రులకు చట్టబద్ధమైన పౌరసత్వం లేకపోతే ఆ సంతానానికి కూడా పౌరసత్వం లభించదు.



...మిగతాది 2 లో

# జీరో సైజ్.. మోసాలు.... ఇంతింత కాదయా...

✍ జయభేరి, హైదరాబాద్, జనవరి 21:

అనుష్క నటించిన జీరో సైజ్ సినిమా చూసే ఉంటారు. కాస్త బొద్దుగా ఉండే అనుష్క.. స్లిమ్ గా మారిపోవాలని ఓ క్లినిక్ లో చేరిపోతుంది. అక్కడ తనలాగే వందల మంది కనిపిస్తారు. క్రమంగా.. రోజులు గడిచే కొద్దీ అసలు విషయం బోధపడుతుంది. అదంతా ఓ వ్యాపారమని.. వారి ఆశలు, మరొకరికి వ్యాపార అవసరాలని గుర్తిస్తుంది. అనైతిక పద్ధతుల్లో, సరైన శాస్త్రీయ ప్రమాణాలు పాటించకుండానే బరువు తగ్గించే టిప్స్ అంటూ.. వినియోగదారుల్ని మోసం చేస్తున్నట్లు గుర్తించి.. పోరాడుతుంది. సరిగా అలాంటి ఘటనే హైదరాబాద్ లో చోటు చేసుకుంది.కాస్తా బరువు పెరిగితే చాలా అమ్మాయిలు తెగ బాధపడిపోతుంటారు. అందమంతా కోల్పోయినట్లు దిగాలు చెందుతారు. ఎవరో ఏదో అనుకుంటారనే అనుమానంతో బరువు తగ్గేందుకు శతవిధాల ప్రయత్నిస్తుంటారు.

# సౌత్ సొమ్ములతో నార్త్.. సోకులు

2 లో




దావోస్‌లోని తెలంగాణ పెవీలియన్‌లో సందడి నెలకొంది. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ 55 వ వార్షిక సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ పెవీలియన్ ప్రారంభించిన తర్వాత కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల మంత్రులు, ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. తెలంగాణ రైజింగ్ నివాదంతో రెండో రోజు అనేక ఉత్తేజకరమైన, పెట్టుబడులకు ఆశాజనకమైన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

# దావోస్‌లో తెలంగాణ తొలి ఒప్పందం

## తెలంగాణలో యూనిలీవర్ భారీ పెట్టుబడులు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరంలో మరో దిగ్గజ కంపెనీ యూనిలీవర్‌తో కీలక ఒప్పందం కుదిరింది. కామారెడ్డి జిల్లాలో ఆయిల్ పామ్ ఉత్పత్తి (రిఫైనింగ్) కేంద్రం, మరో ప్రాంతంలో బాటిల్ క్యాప్‌లను తయారు చేసే యూనిట్‌ను నెలకొల్పడానికి యూనిలీవర్ ఒప్పందం చేసుకుంది. ఎఫ్ఎంసీజీ రంగంలో ప్రపంచంలోనే అతిపెద్ద కంపెనీల్లో ఒకటైన యునిలీవర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యుటివ్ ఆఫీసర్ హెయిన్ షూమాకర్, చీఫ్ సప్లయి చైన్ ఆఫీసర్ విల్లెం ఉయిజెన్ తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు జరిపిన చర్చల అనంతరం ఈ మేరకు ఒప్పందం కుదిరింది.
దక్షిణ భారతదేశంలో అన్ని రాష్ట్రాలకు తెలంగాణ వ్యూహాత్మక కేంద్రంగా ఉంటుందని, విస్తృత మార్కెట్‌కు మిగతా రాష్ట్రాలకు ఈ ప్రాంతం ముఖద్వారంగా ఉంటుందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అన్నారు. పెట్టుబడులకు, పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణలో ఉన్న సానుకూల పరిస్థితులను వారికి వివరించారు. దేశంలో యూనిలీవర్‌కు పలుచోట్ల కేంద్రాలు ఉన్నప్పటికీ తెలంగాణలో విస్తరించలేదని, వినియోగ వస్తువులకు రాష్ట్రంలో భారీ మార్కెట్ ఉందని, ఇక్కడి సులభతర వ్యాపార విధానాలు తయారీ సంస్థలకు అదనపు బలంగా ఉంటాయని ముఖ్యమంత్రి చెప్పారు. యునిలీవర్ సంస్థ సీఈవో షూమాకర్ మాట్లాడుతూ... తెలంగాణలో పామాయిల్ ఫ్యాక్టరీ, రిఫైనింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. అలాగే, బాటిల్ క్యాప్‌లను ఉత్పత్తి చేయడానికి కొత్త తయారీ యూనిట్‌ను నెలకొల్పుతామని చర్చల సందర్భంగా తెలిపారు. ప్రస్తుతం యూనిలీవర్ సంస్థ తమ ఉత్పత్తుల బాటిల్ క్యాప్‌లను ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోనే బాటిల్ క్యాప్ యూనిట్‌ను నెలకొల్పడం ద్వారా వాటి కొరతను అధిగమించవచ్చు. రాష్ట్రంలో యూనిలీవర్ విస్తరణకు ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తామని, పామాయిల్ యూనిట్ ఏర్పాటుకు కామారెడ్డి జిల్లాలో అవసరమైన స్థలాన్ని కేటాయిస్తామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చెప్పారు.



# రంగం ఏదైనా.. భారతీయులదే విజయం

- వంద దేశాల్లో తెలుగు ప్రజల సేవలు
- గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్లుగా ఎదిగే సత్తా ఉంది
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఏపీ విధానం
- గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ ఫ్యూయల్ రంగంలో అగ్రగామిని చేస్తాం
- దావోస్ సీఐఐ సెషన్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు

✍ జయభేరి, దావోస్ :

వ్యాపార, వాణిజ్య రంగాల్లో విజయం సాధించి... గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్లుగా ఎదిగే సత్తా భారతీయల్లో ఉందని..., ప్రపంచంలో అందరికీ అత్యంత ఆమోదయోగ్యమైన ఏకైక కమ్యునిటీగా భారతీయులు గుర్తింపు పొందారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) రెండో రోజున, భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) ప్రత్యేక సెషన్‌లో గ్రీన్ ఇండస్ట్రియలైజేషన్‌పై ముఖ్యమంత్రి ప్రసంగించారు. 100కు పైగా దేశాల్లో తెలుగువారు ఉన్నారని, తక్కువ సమయంలోనే ఇంతలా తెలుగువారు విశ్వవ్యాప్తం అవుతారని ఎవరూ ఊహించలేదన్నారు.

...మిగతాది 2 లో




# అధికారంలోకి వస్తే కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్య

- బిజెపి తాజాగా మంగళవారం మరొక మేనిఫెస్టోను విడుదల

✍ జయభేరి, న్యూఢిల్లీ, జనవరి 21:

ఢిల్లీ శాసనసభ ఎన్నికలకు సమయం సమీపిస్తోంది. ఎన్నికల్లో విజయం కోసం ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), భారతీయ జనతా పార్టీ (బిజెపి), కాంగ్రెస్ పార్టీలు వోటర్లను ఆకర్షించేందుకు హామీలను గుప్పిస్తున్నాయి. ఇప్పటికు మేనిఫెస్టోను ప్రకటించిన బిజెపి తాజాగా మంగళవారం మరొక మేనిఫెస్టోను విడుదల చేసింది. తాము అధికారంలోకి వస్తే అర్హులైన విద్యార్థులకు కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్య సౌకర్యం కల్పిస్తామని బిజెపి వాగ్దానం చేసింది. పాలిటెక్నిక్‌ర ఐటిఐలలో

...మిగతాది 2 లో

...మిగతాది 2 లో

# ఛత్తీస్గఢ్.. భారీ ఎన్కౌంటర్

## 14 మంది నక్సలైట్లు మృతి

## మృతుల్లో ఇద్దరు మహిళా మవోయిస్టులు

✍ జయభేరి, నౌపాడ (ఒడిషా):





ఛత్తీస్గఢ్, ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలో భారీ ఎన్కౌంటర్ జరిగింది. ఛత్తీస్ ఘడ్, ఒఢిషా రాష్ట్రాల సరిహద్దుల్లోని కులరిఘాట్ ఆడవిలో మావోయిస్టుల సంచారం పై పోలీసులకు సమాచారం అందింది. దాంతో ఇరు రాష్ట్రాల బలగాలు, సీఆర్పిపిఎఫ్ దళాలు నౌపాడ, గరియాగంజ్ ఆటవీ ప్రాంతాల్లో కుంబింగ్

▶▶ మొదటిపేజీ తరువాయి

## అమెరికాలో పుట్టినా ఇక కష్టమే..

ఈ నిర్ణయంతో లక్షలాది మంది ప్రవాస భారతీయులపై ఎఫెక్ట్ చూపనుంది. నల్లజాతి పౌరులకు అమెరికా పౌరసత్వం కల్పించే విషయంలో చేసిన చట్ట సవరణను తప్పుగా అన్వయించుకున్నట్టు పేర్కొన్నారు. అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో ఎక్కడ జన్మించినా వారంతా అమెరికా పౌరులుగా గుర్తిస్తూ అమెరికా రాజ్యాంగంలో 14వ సవరణలో పేర్కొన్నారు. 1857లో ఆఫ్రికా దేశాల నుంచి వచ్చిన వారికి పౌరసత్వాన్ని కల్పించే విషయంలో అమెరికా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఈ సవరణ చేపట్టారు. అయితే 14వ అమెరికా రాజ్యాంగ సవరణ ఆఫ్రికాలో స్థిరపడిన వారి కోసం నిర్వచించారని, అమెరికాలో జన్మించిన ప్రతి ఒక్కరికి ఆ సవరణ వర్తింపచేయాలనే ఉద్దేశం అందులో లేదని తాజా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సవరణ ప్రకారం "యునైటెడ్ స్టేట్స్‌లో జన్మించిన లేదా ప్రకృతిసిద్ధంగా పొందిన అన్ని వ్యక్తులు మరియు దాని పరిధికి లోబడి ఉంటారు, అమెరికా సంయుక్త రాష్ట్రాల పౌరులు మరియు వారు నివసిస్తున్న రాష్ట్రాల్లో అమెరికా పౌరులై ఉంటారని రాజ్యాంగ సవరణలో పేర్కొన్నారు. పద్నాలుగవ రాజ్యాంగ సవరణలో అమెరికాలో జన్మించిన ప్రతి ఒక్కరికీ పుట్టుకతోనే పౌరసత్వం విస్తరించేలా అర్థాన్నిచ్చేలా లేదని తాజా నిర్ణయంలో పేర్కొన్నారు. పద్నాలుగవ సవరణలో "అమెరికా పరిధికి లోబడి లేకుండా" అమెరికాలో జన్మించిన వ్యక్తులను పుట్టుకతోనే అమెరికా పౌరసత్వం నుండి మినహాయించినట్టు పేర్కొన్నారు. ఈ నిర్ణయం ప్రకారం "అమెరికాలో జన్మించిన వారు, దాని పరిధికి లోబడి ఉండే వ్యక్తులకు జన్మించినప్పుడు మాత్రమే అక్కడే పుట్టే వారికి అమెరికా జాతీయత లభిస్తుంది. పద్నాలుగవ రాజ్యాంగ సవరణను తప్పుగా అన్వయించుకున్నట్టు తాజా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇకపై అమెరికాలో జన్మించినా, అమెరికా పరిధికి లోబడి లేని వ్యక్తులు, వర్గాలు, జాతీయులకు అమెరికాలో జన్మించిన సంతానానికి ఇకపై స్వయంచాలకంగా పౌరసత్వం లభించదు. గతంలో అమెరికాలో పుట్టిన వారికి వారి తల్లిదండ్రులతో సంబంధం లేకుండా పౌరసత్వం లభించేది. పౌరసత్వం కోసమే అమెరికా వెళ్లి పిల్లల్ని కన్న వారి ఉదంతాలు కూడా ఉన్నాయి. అమెరికా జాతీయులకే అవకాశాలు పేరుతో ఎన్నికల్లో ట్రంప్ విస్తృత ప్రచారం చేశారు. దానికి అనుగుణంగా తాజా నిర్ణయం తీసుకున్నారు. అమెరికాలో జన్మించిన వారి తల్లి చట్టబద్ధంగా నివాసం ఉంటున్నా, శాశ్వత నివాసం లేకపోయినా పిల్లలకు పౌరసత్వం లభించదు. అమెరికాలో జన్మించిన పిల్లల తల్లి అక్రమంగా నివసిస్తున్నా, తండ్రి అమెరికా పౌరుడు కాకపోయినా ఆ సంతానానికి పౌరసత్వం దక్కదు. శిశువు తల్లి అమెరికాలో చట్టబద్ధంగా ఉంటున్నా, టూరిస్ట్, స్టూడెంట్, వర్క్ పర్మిట్ ఉంటూ అమెరికా పౌరుడు కాని తండ్రికి జన్మించినా వారికి పౌరసత్వం దక్కదు. తాజా నిర్ణయం ప్రకారం ఇకపై ఇలాంటి వారికి అమెరికా పౌరసత్వ ధృవీకరణలు మంజూరు చేయకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇకపై అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో ఇకపై పౌరసత్వ ధృవీకరణ పత్రాలను జారీ చేయకూడదని తాజా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తాజా ఉత్తర్వులపై 30రోజుల్లోగా సంబంధిత శాఖలు ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఉత్తర్వుల్లో తల్లిదండ్రులకు సంబంధించిన నిర్వచనాలను కూడా స్పష్టం చేశారు. అమెరికాలో చట్టబద్ధమైన శాశ్వత నివాసితుల పిల్లలు సహా ఇతర వ్యక్తుల అమెరికా పౌరసత్వం పత్రాలను పొందే హక్కును తాజా నిర్ణయం ప్రభావితం చేయదని ఉత్తర్వులల్లో స్పష్టం చేశారు. తాజా నిర్ణయంతో అమెరికాలో స్థిరపడాలని భావించే వారి ఆశలపై నీళ్లు చల్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏటా లక్షలాది మంది ఉద్యోగం ఉపాధి అవకాశాల కోసం అమెరికా వెళుతున్నారు. ఇకపై వారికి అమెరికాలో శాశ్వత నివాసం లభించడం కష్టం కానుంది.

## కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్య

టెక్నికల్ కోర్సులు చేస్తున్న షెడ్యూల్డ్ కులాల (ఎస్సి) విద్యార్థులకు భీమ్ రావ్ అంబేద్కర్ స్టైపెండ్ పథకం కింద ప్రతి నెల రూ. 1000 వంతున ఉపకార వేతనాలు అందజేస్తామని పార్టీ హామీ ఇచ్చింది. యుపిఎస్సి, రాష్ట్ర సివిల్ సర్వీస్ కమిషన్ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువతకు రూ. 15 వేల ఆర్థిక సాయం అందజేస్తామని పార్టీ ప్రకటించింది. ఒక ఆటో ట్యాక్సీ డ్రైవర్ సంక్షేమ మండలిని ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించిన బిజెపి డ్రైవర్లకు రూ. 10 లక్షల జీవిత బీమా, రూ. 5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తామని వాగ్దానం చేసింది. అదే విధంగా ఇళ్లలో పని చేసే కార్మికుల కోసం సంక్షేమ మండలి ఏర్పాటుకు, అవే బీమా సౌకర్యాల కల్పనకు పార్టీ వాగ్దానం చేసింది. కేంద్ర మాజీ మంత్రి, బిజెపి సీనియర్ నేత అనురాగ్ ఠాకూర్ ఈ మేరకు బిజెపి సంకల్ప్ పత్ర పార్ట్ 2ను విడుదల చేశారు. ఆప్ హయాంలో చోటు చేసుకున్న కుంభకోణాలు, అవినీతిపై సిట్ ఏర్పాటు చేస్తామని అనురాగ్ ఠాకూర్ తెలియజేశారు. ఢిల్లీలో జల్ జీవన్ మిషన్ అమలులో విఫలమైనందుకు ఆప్ ప్రభుత్వాన్ని అనురాగ్ ఠాకూర్ విమర్శించారు. సంకల్ప్ పత్ర పార్ట్ 1ను బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా ఇటీవలే విడుదల చేశారు. గర్భిణీ స్త్రీలకు రూ. 21 వేల ఆర్థిక సాయం, మహిళా సమృద్ధి యోజన కింద ఢిల్లీలోని మహిళలకు నెలకు రూ. 2500 ఆర్థిక సాయం, పేద కుటుంబాలకు సబ్సిడీపై ఎల్‌పిజి సిలిండర్లను రూ. 500 ధరకే అందజేయడం వంటివి బిజెపి తొలి మేనిఫెస్టోలో ఉన్నాయి. మరొక వైపు బిజెపి మేనిఫెస్టోపై ఆప్ అధినేత అర్వింద్ కేజ్రీవాల్ స్పందిస్తూ, బిజెపి అధికారంలోకి వస్తే అర్హులైన విద్యార్థులకు మాత్రమే ఉచిత విద్య లభిస్తుందా అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో ప్రతి విద్యార్థికీ ఉచిత విద్య అభిస్తోందని ఆయన తెలిపారు. ఢిల్లీ ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కేజ్రీవాల్ కోరారు.

## ఛత్తీస్గఢ్.. భారీ ఎన్కౌంటర్

ప్రారంభించాయి. సోమవారం నాడు ఇద్దరు మహిళా మావోయిస్టులు పోలీసుల ఎదురు కాల్పుల్లో హతమయ్యారు. అక్కడే భారీ ఎత్తున ఆయుధాలు, ఐఈడీలు స్వాధీనం చేసుకున్నారు. గాలింపు చర్యలు కొనసాగుతున్న తరుణంలో మంగళవారం తెల్లవారుజామున పోలీసులకు మావోయిస్టులు తరసపడ్డారు. అప్పుడు జరిగిన ఎదురు కాల్పుల్లో 12 మంది నక్సలైట్లు మృతి చెందారు. మృతుల సంఖ్య పెరగవచ్చని సమాచారం. ఈ నెల లో ఇప్పటివరకు చత్తీస్ ఘడ్ రాష్ట్రంలో 14 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఉమ్మడి ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది. ఎన్‌కౌంటర్‌లో కోబ్రా బెటాలియన్‌కు చెందిన ఒక సైనికుడు కూడా గాయపడినట్లు సమాచారం. ఒరిస్సా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన పోలీసు అధికారులు ఆపరేషన్‌ను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

## రంగం ఏదైనా..

మానవ వనరుల లభ్యత ఏపీకి ప్లస్ పాయింట్ అని, భారతీయ పారిశ్రామికవేత్తలు, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంతోమంది ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు దోహదపడుతున్నారని, తమ ప్రతిభతో రాణిస్తున్నారని ముఖ్యమంత్రి అన్నారు.

**సరైన సమయంలో సరైన ప్రధాని :**

"25 ఏళ్ల క్రితం బిల్ గేట్స్ ఇంటర్నెట్ ప్రవేశపెట్టారు. 1991లో భారత ప్రభుత్వం ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చింది. ఈ రెండింటిని అవకాశంగా తీసుకుని మేము రెండవ దశ సంస్కరణలు తీసుకొచ్చాం. ఫలితాలు వచ్చాయి. సరైన సమయమంలో దేశానికి సరైన వ్యక్తి ప్రధానిగా ఉన్నారు. మూడవ సారి నరేంద్ర మోదీ ప్రధాని అయ్యారు. చాలా దేశాల్లో రాజకీయ సందిగ్ధత ఉంది... కానీ భారతదేశంలో అది లేదు. పరిపాలనలో ఒక స్పష్టతతో వెళ్తున్నారు." అని చంద్రబాబు అన్నారు.

**నాటి సంస్కరణల ఫలితమే నేటి హైదరాబాద్ :**

నాడు తాను తెచ్చిన సంస్కరణలతో రెండున్నర దశాబ్దాల్లో హైదరాబాద్ అభివృద్ధి చెందిందని, గ్రూప్ ఆఫ్ కాన్సెప్ట్ రూపొందించడంలో ట్రాక్ రికార్డ్ ఉందని, హైదరాబాద్ కూడా ఒక గ్రూప్ ఆఫ్ కాన్సెప్ట్ నగరం అయ్యిందని అన్నారు. దేశంలో నివాసయోగ్యానికి హైదరాబాద్ అత్యంత అనువైనం ప్రాంతంగా తీర్చిదిద్దామని అన్నారు. ఫార్మా, ఐటీ, ఫైనాన్స్, క్రీడలు, ఆసుపత్రులు ఇలా అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించిందన్నారు.

## నిర్మాత దిల్ రాజు ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ సోదాలు..

**హైదరాబాద్:**
ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఎఫ్డీసీ చైర్మన్ దిల్ రాజు నివాసం, కార్యాలయాల్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం నుంచి ఏకకాలంలో 8 చోట్ల 55 బృందాలతో తనిఖీలు జరుగుతున్నాయి. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్లో దిల్ రాజు ఇళ్లతో పాటు ఆయన సోదరుడు శిరీశ్, కుమార్తె హన్సితరెడ్డి నివాసాల్లోనూ ఐటీ అధికారులు సోదాలు చేస్తున్నారు. వ్యాపార భాగస్వాముల నివాసాల్లోనూ తనిఖీలు నిర్వహిస్తున్నారు. వివిధ పత్రాలను అధికారులు పరిశీలిస్తున్నారు.

# సౌత్ సొమ్ములతో నార్త్.. సోకులు

**జనాభా తగ్గడం వల్ల దక్షిణ భారత రాష్ట్రాలకు సమీప భవిష్యత్ లో చాలా రకాలుగా నష్టాలు, సవాళ్లు ఎదురవబోతున్నాయి. ఇక్కడి వ్యాపార గ్యాప్, ఉద్యోగాల గ్యాప్ ను ఉత్తరాది రాష్ట్రాలు ఫిలప్ చేసే ఛాన్సెస్ ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే అది చాలా స్పష్టంగా కనిపిస్తోంది. ప్లంబింగ్ దగ్గర్నుంచి హౌస్ కన్స్ట్రక్షన్, ఐటీ దాకా నార్త్ జనమే సౌత్ లో పెరుగుతున్నారు. ఇక సౌత్ స్టేట్స్ లో వ్యాపారాలు చేసేందుకు రాజస్థాన్, యూపీ సహా ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున వలస వస్తున్నారు. మంచి పొజిషన్ కు వెళ్తున్నారు. కారణం ఇక్కడ భారీ గ్యాప్ ఉండడమే. వాళ్ల రాష్ట్రాల్లో పోటీ ఎక్కువుండడం, జనాభా ఎక్కువుండడంతో సౌత్ కు తరలి వస్తూనే ఉన్నారు. రైట్ ఈ ఏడాది జనగణన జరగబోతోంది.**




ఇది 2026 దాకా కొనసాగుతుంది. ఆ లెక్కల ప్రకారమే నియోజకవర్గాల పునర్విభజన ఉండబోతోంది. అంటే జనం ఎక్కడ ఎక్కువుంటే అన్నేసి నియోజకవర్గాలు పెరుగుతాయన్న మాట. అదే జరిగితే జనం తక్కువగా ఉన్న సౌత్ లో నియోజకవర్గాల్లో పెద్దగా మార్పు ఉండదు. అదే టైంలో నార్త్ లో ముఖ్యంగా యూపీ, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి చోట్ల విపరీతమైన జనాభాతో ఎక్కువ సీట్లు పెరిగే అవకాశం ఉంటుంది. సీట్లు ఒక్కటే కాదు... నిధుల పంపిణీ కూడా జనాభా ఆధారంగానే జరుగుతుంది. ఇప్పుడు కూడా అలాగే నడుస్తోంది. అందుకే సౌత్ స్టేట్స్ చాలా టెన్షన్, అటెన్షన్ తో ఉన్నాయి. కేంద్రం నుంచి అందాల్సిన నిధులపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందుతున్నాయజనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేస్తే దక్షిణాదికి తీరని అన్యాయం జరుగుతుందని, దక్షిణాదిఉత్తరాది అనే చర్చ వచ్చే ఆస్కారం ఉంది కాబట్టి కేంద్ర ప్రభుత్వమే దీనికి స్పష్టమైన విధాన రూపకల్పన చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఎప్పటి నుంచో చెబుతున్నారు.
దేశ జనాభాలో సౌత్ స్టేట్స్ 18 శాతమే ఉన్నా.. జీడీపీలో వాటా 35శాతంగా ఉంది. అంతెందుకు తలసరి ఆదాయం విషయంలో జాతీయ సగటు కంటే దక్షిణాది రాష్ట్రాలే టాప్. కానీ ఏం లాభం? కేంద్ర నిధుల పంపిణీ మాత్రం జనాభా ఎక్కువున్న రాష్ట్రాలకే ఎక్కువ అన్న ఫార్ములా టోటల్ గా ఎఫెక్ట్ చూపుతోంది. 1 970ల్లో కేంద్ర ప్రభుత్వం జనాభా నియంత్రణ కార్యక్రమాలు చేపట్టింది. వీటిని సౌత్ స్టేట్స్ పక్కాగా అమలు చేసి అభివృద్ధికి బాటలు వేశాయి. కానీ ఉత్తరాది రాష్ట్రాలు జనాభాను కంట్రోల్ చేయలేకపోయాయి. అదుపు చేసుకోకుండా పెంచుకుంటూ వెళ్లాయి. ఇదే ఇప్పుడు సమస్యగా మారుతోంది. జనాభాను నియంత్రించుకుని ఇప్పుడు ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక నష్టపోవాల్సిన పరిస్థితి వచ్చింది. జన సంఖ్య అదుపు చేసుకోలేకపోయిన ఉత్తరాది రాష్ట్రాలు లాభపడే సీన్ ఏర్పడింది. అందుకే జనాభా ప్రాతిపదికన నిధుల బట్వాడా కాకుండా ఆర్థికంగా మంచి పర్ఫార్మెన్స్ చూపే ఆధారంగా ఇవ్వాలంటున్నారు. అది జరగాలంటే రాజ్యాంగంలోని ఆర్టికల్ 81కు సవరణ చేయడం ద్వారా దక్షిణ భారత రాష్ట్రాలు నష్టపోకుండా కొత్త ఫార్ములా తీసుకురావాలి. కానీ ఇది చేసేదెవరు? దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల వాదన వినేదెవరన్న చర్చ జరుగుతోంది.. జనవరి నెలకు గానూ కేంద్రపన్నుల్లో రాష్ట్రాల వాటాను ఎలా పంచిందో? మొత్తం లక్షా 73 వేల 30 కోట్లను 28 రాష్ట్రాలకు డిస్ట్రిబ్యూట్ చేసింది. ఇందులో బిమారూ స్టేట్స్ అని నాలుగు రాష్ట్రాలకు పేరుంది.
అవి బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్. ఇందులో బిహార్ కు ఏకంగా 17 వేల 403 కోట్లు, మధ్యప్రదేశ్ కు 13,582 కోట్లు, రాజస్థాన్ కు 10 వేల 426 కోట్లు, ఇక ఉత్తరప్రదేశ్ కు ఏకంగా 31 వేల 39 కోట్లు పంచింది కేంద్రం. ఇది 2025 జనవరి పన్నుల వాటా లెక్కలు. ఇందులో టాప్ త్రీలో బిమారూ రాష్ట్రాలైన యూపీ, బిహార్, మధ్యప్రదేశే ఉన్నాయి. మరి ఆ రాష్ట్రాల నుంచి కేంద్రానికి వెళ్లింది గోరంత. తీసుకున్నవి కొండంత. నిన్న మొన్నటిదాకా భారత్ కు యువతే బలం, యువశక్తి ఎక్కువున్న దేశం అంటూ అంతా మాట్లాడుకునే వారు. కానీ ఇప్పుడు అది తగ్గుతోంది. ఇకపైనా తగ్గుముఖమే పడుతుందని పరిస్థితులు చెబుతున్నాయి. అందుకే గతంలో జనాభా నియంత్రణ అన్న వారే ఇప్పుడు కనండి బాబూ కనండి అంటున్నారు. కథ మార్చాల్సిన టైం వచ్చిందంటున్నారు. లేకపోతే పెను నష్టం తప్పదంటున్నారు. జనాభా పెరగకపోతే నిజంగానే అంత పెద్ద నష్టం ఉందా? జనాభా లెక్కల విషయంలో చైనా నుంచి మొదలు పెడుదాం. ఒకప్పుడు చైనా ప్రపంచంలోనే ఎక్కువ జనాభా ఉన్న దేశంగా ఉండేది. కానీ భారత్ దాన్ని అధిగమించింది. సీన్ కట్ చేస్తే ఇప్పుడు వరుసగా మూడో ఏడాది చైనాలో జనాభా తగ్గిపోయినట్లు లెక్కలు రిలీజ్ చేసింది. దీంతో అక్కడ భయాలు పెరుగుతున్నాయి. ఎందుకంటే ఓవైపు వృద్ధుల జనసంఖ్య పెరుగుతోంది. అదే సమయంలో పని చేసే యువత సంఖ్యలో తగ్గుదల స్పష్టంగా కనిపిస్తోంది. చైనా ఒక్కటే కాదు తూర్పు ఆసియాలో, జపాన్, సౌత్ కొరియా, హాంకాంగ్ లోనూ జనాభా పడిపోయింది.
ఇందుకు కారణం పెరుగుతున్న ఖర్చులు, విద్య, ఉద్యోగం అనే సరికి పెళ్లిళ్లు, ఆ తర్వాత సంతానాలు వాయిదా పడుతున్నాయి. చైనాకు బలం ఆ దేశ జనాభానే. ప్రపంచంలో ప్రస్తుతం రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. ఇది ఫస్ట్ ప్లేస్ కు రాకముందే వృద్ధుల సంఖ్య పెరిగి రివర్స్ అవుతుందన్న భయాలు వారిని వెంటాడుతున్నాయి. 2100 నాటికి చైనా జనాభా 73 కోట్లు ఉంటుందన్న అంచనాలు ఆ దేశ ఆర్థికవ్యవస్థకు పెను సవాళ్లే. ఇప్పుడు మనదేశం విషయానికొద్దాం. కొన్ని రాష్ట్రాల్లో విపరీతంగా జనాభా ఉంటే ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో మాత్రం తగ్గుతోంది. సో ఆటోమేటిక్ గా జనాభా ఎక్కువున్న రాష్ట్రాల్లో విద్య, ఉపాధి, ఉద్యోగ, వ్యాపార అవకాశాలు లేని వారంతా దక్షిణ భారత రాష్ట్రాలకు విపరీతంగా వలస వస్తున్నారు. ఇక్కడున్న జనాభా గ్యాప్ ను వలసలతో ఫిల్ చేస్తున్నారు. ఇది శాశ్వత పరిష్కారం కాదు. ఒకప్పుడు కుటుంబ నియంత్రణ చర్యల్లో భాగంగా సౌత్ ఇండియన్ స్టేట్స్ కట్టుదిట్టంగా ఆ రూల్ ను ఫాలో అయ్యాయి. ఇంటికి ఒకరు లేదా ఇద్దరి వరకే సంతానాన్ని సరిపెట్టారు. కానీ ఇప్పుడు అలాగే ఉంటే కుదిరే పరిస్థితి కనిపించడం లేదు.
అందుకే ఏపీ సీఎం చంద్రబాబు ప్రతి సందర్భంలోనూ ఇదే మాట మాట్లాడుతున్నారుజనాభానే అసలైన ఆస్తి అన్నది ప్రస్తుతం డౌన్ ట్రెండ్ లో ఉన్న చైనా ఆందోళన చూస్తే అర్థమవుతోంది. ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఆందోళన చూస్తే అర్థం చేసుకోవచ్చు. ఎందుకంటే జనాభా లేకపోతే ఏ పనీ చేయలేని పరిస్థితి. సంపద సృష్టి, మ్యాన్ పవర్ జెనరేషన్ ఇవన్నీ తగ్గి మ్యాటర్ లేకుండా పోతుంది. ఇద్దరు పిల్లలకు మించి ఉన్న వారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులనే నిబంధనను కుటుంబ నియంత్రణ చర్యల్లో భాగంగా 1994లో ఉమ్మడి ఏపీలో తీసుకొచ్చారు. కానీ ఇప్పుడు దాన్ని తీసేస్తామని పిల్లలు లేని వారికి పోటీకి అనర్హత విధిస్తామంటున్నారు చంద్రబాబు. భారత జనాభా 2060ల నాటికి గరిష్ట స్థాయికి చేరుకుంటుందని, ఆ తర్వాత అది క్రమంగా తగ్గుముఖం పడుతుందని అంచనా వేస్తున్నారు. ఒక్కరిద్దరినే కనాలి.
వారికి మంచి చదువు, మంచి ఆరోగ్యం, మంచి భవిష్యత్ కల్పించేలా చూసుకోవాలన్న కాన్సెప్ట్ తో చాలా మంది ఉంటున్నారు. ఇవాళ్టి రోజుల్లో కాస్ట్ ఆఫ్ లివింగ్ చాలా పెరిగింది. ఎంత సంపాదించినా డైలీ ఖర్చులకే సరిపోతుండడంతో మధ్యతరగతి జనం చాలా వరకు ఒకరిద్దరు సంతానంతోనే సరిపెడుతున్నారు. ఈ రోజుల్లో ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ మందిని కనేందుకు ఎవరూ సిద్ధంగా లేరు.
ఎందుకంటే ఆ స్థాయి ఖర్చులను భరించే స్తోమత ఉండడం లేదు. కానీ ఇది దేశానికే అందులోనూ సౌత్ ఇండియాకు పెద్ద ఎత్తున నష్టం కలిగించే పరిణామంగా మారుతోందిజనాభా పెరుగుదల విషయంలో ఇప్పుడు కొత్త విషయాలు బయటికొస్తున్నాయి. ఈ ఏడాది జనగణన జరిగే అవకాశం ఉంది. ఆ ప్రకారమే నియోజకవర్గాల పునర్విభజన, నిధుల కేటాయింపులు ఉండబోతున్నాయి. దాంతో దేశానికి ఎక్కువ సంపాదించి పెడుతున్న దక్షిణాది రాష్ట్రాలైనా ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక విపరీతంగా నష్టపోయే ముప్పు ఎదుర్కొంటున్నాయి. అందుకే జనాభా పెంచాలని చంద్రబాబు, స్టాలిన్ అంటున్నారు. మరోవైపు జనాభా ప్రకారం కాకుండా రాష్ట్రాల పన్నుల వాటా ఆధారంగా నిధుల డిస్ట్రిబ్యూషన్ ఉండాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వాదిస్తున్నారు.

## జీరో సైజ్..

అలాంటి వాళ్లే టార్గెట్ గా అనేక సంస్థలు పుట్టుకొచ్చాయి. మోసపోయే వాళ్లు ఉన్నంత కాలం.. మోసం చేసే వాళ్లు ఉంటారు అన్నట్లుగా ఇదో వ్యాపారంగా మారిపోయింది. ఉన్నఫళంగా బరువు తగ్గిపోవాలని కోరుకునే వాళ్ల ఆశలకు అంతు లేనప్పుడు.. వారికి మంచి మాటలతో లక్షలు, కోట్లు పోగుసుకునే వాళ్లూ ఉంటూనే ఉంటారు. ఇలాంటి ఓ సంస్థకు రాష్ట్ర వినియోగదారుల కమిషన్ షాక్ ఇచ్చింది. వైద్యుల సలహా లేకుండా, నిపుణుల పర్యవేక్షణ లేకుండా ఊబకాయం, శరీరంలోని అధిక కొవ్వును తగ్గిస్తామనే క్లినిక్ లపై నివేదిక సమర్పించాలంటూ.. హైదరాబాద్ డీఎం&హెచ్‌వో, వైద్య విధాన పరిషత్ లకు ఆదేశాలు జారీ చేసింది. బరువు తగ్గిస్తామని చెప్పి.. భారీగా డబ్బులు కట్టించుకున్న ఓ సంస్థ నుంచి తిరిగి వడ్డీతో సహా తిరిగి వసూలు చేసింది. సంగారెడ్డికి చెందిన ఓ యువతి అధిక బరువు తగ్గించుకునేందుకు హైదరాబాద్, హఫీజ్ పేటలోని కలర్స్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ అనే క్లినిక్ ను సంప్రదించింది. 2022లో కలర్స్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ మియాపూర్ బ్రాంచిలో చేరి రూ. 1.05 లక్షలు ఫీజుగా చెల్లించారు. కానీ.. అక్కడ అనుకున్న మేర ఫలితాలు రాకపోవడం, సరైన వైద్య సహాయం లేకుండానే చికిత్స అందిస్తుండడంతో.. ఆ యువతి తనకు అందిస్తున్న కోర్సు నుంచి బయటకు వచ్చేసింది. తాను చెల్లించిన డబ్బుల్ని తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేసింది. సదరు సంస్థ నిరాకరించడంతో.. సంగారెడ్డిలోని జిల్లా వినియోగదారుల కమిషన్ ను ఆశ్రయించింది ఆ యువతి. బరువు తగ్గిస్తామని చెప్పి తనను మోసం చేశారని, అధికంగా డబ్బులు వసూలు చేసి మోసం చేసారంటూ ఫిర్యాదు చేసింది. దీనిపై విచారించిన జిల్లా వినియోగదారుల కమిషన్... ఫిర్యాదుదారుకు అనుకూలంగా తీర్పు వెలువరించింది. యువతి చెల్లించిన ఫీజు తిరిగి చెల్లించాలని సూచించింది. ఈ తీర్పును వ్యతిరేకించిన కలర్స్.. రాష్ట్ర వినియోగదారుల కమిషన్ ను సంప్రదించారు. ఈ కేసు వివరాల్ని పరిశీలించిన రాష్ట్ర వినియోగదారుల కమిషన్ ఇన్‌ఛార్జి అధ్యక్షురాలు మీనా రామనాథన్, సభ్యులు వి.వి.శేషుబాబులతో కూడిన ధర్మాసనం.. క్లినిక్ కు వ్యతిరేకంగా తీర్పు వెలువరించింది. నిబంధనలకు విరుద్ధంగా యువతి నుంచి డబ్బులు వసూలు చేయడంతో పాటు బరువు తగ్గిస్తామని మోసం చేసినట్లు గుర్తించింది. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం కింద సదరు సంస్థ రిజిస్ట్రేషన్ చేయించుకున్నప్పటికీ.. బరువు తగ్గించే అంశం అందులో లేదని గుర్తు చేసింది.
కేవలం.. ఫిజియోథెరపీ, చర్మ రక్షణకు సంబంధించిన అనుమతి మాత్రమే ఉందని తెలిపింది. అలాంటప్పుడు.. ప్రభుత్వ అనుమతి లేకుండా, వైద్యుల పర్యవేక్షణ లేకుండా.. యువత నుంచి డబ్బులు ఎలా స్వీకరించారని, అలాంటి సర్వీసులు ఎందుకు అందిస్తున్నారంటూ మండిపడింది. సరైన ధ్రువపత్రాలు లేకుండా ఇలాంటి సంస్థలను నిర్వహించడం సేవా లోపమంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎలాంటి అనుమతులు, సర్టిఫికెట్, లైసెన్స్ లేకుండా బరువు తగ్గిస్తామని హామీ ఇచ్చిన సంస్థకు జలక్ ఇచ్చింది. యువతికి ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో విఫలమైనందుకు యువతి చెల్లించిన రూ. 1.05 లక్షలకు 9% వడ్డీని జత చేసి ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. దాంతో పాటు యువతి మానసిక వేదనకు కారణమయ్యారంటూ ఆరోపిస్తూ యువతికి పరిహారం కింద రూ. 50 వేలు, కోర్టు ఖర్చులకు మరో రూ. 5 వేలు చెల్లించాలంటూ తీర్పు వెలువరించింది. దాంతో పాటే.. రాష్ట్రంలోని ఇలాంటి ఇతర సంస్థలపై చర్యలకు సిద్ధమైన రాష్ట్ర వినియోగదారుల కమిషన్.. అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా పుట్టుకొస్తున్న క్లినిక్‌ల పై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని హైదరాబాద్ డీఎం&హెచ్‌వో, వైద్య విధాన పరిషత్ లకు ఆదేశాలు జారీ చేసింది. ఇలాంటి సంస్థల కార్యకలాపాలపై మార్చి 17లోగా పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలంటూ ఆదేశించింది.



## ఉత్తరాది భక్తుల కోసం ప్రయాగ్ రాజ్ లో శ్రీవారి నమూనా ఆలయం

■ ప్రయాగ్ రాజ్ లో టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు

**జయభేరి, తిరుమల, జనవరి 21:**

ఉత్తరాది భక్తుల కోసం ప్రయాగ్ రాజ్ లో మహా కుంభ మేళా సందర్భంగా శ్రీవారి నమూనా ఆలయం ఏర్పాటు చేసినట్లు టిటిడి చైర్మన్ బి.ఆర్. నాయుడు తెలియజేశారు. ప్రయాగ్ రాజ్ లోని శ్రీవారి నమూనా ఆలయాన్ని టిటిడి చైర్మన్ బి.ఆర్. నాయుడు దంపతులు సోమవారం సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు హెచ్ డిపిపి సెక్రెటరీ శ్రీరామ్ రఘునాథ్, డిప్యూటీ ఇఒ గుణ భూషణ్ రెడ్డి, స్వాగతం పలికారు. దర్శనానంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన ఆలయ ప్రాంగణంలో శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చతుర్వేద హవనంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జనవరి 13 నుండి ఫిబ్రవరి 26వ తేది సంక్రాంతి నుండి శివరాత్రి వరకు 45 రోజుల పాటు జరుగుతున్న ప్రయాగ్ రాజ్ లోని మహా కుంభ మేళాలో శ్రీవారి నమూనా ఆలయం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని అన్నారు. 250 మంది టిటిడి సిబ్బంది డిప్యూటేషన్ పై శ్రీవారి నమూనా ఆలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఉత్తరాదిలో ధర్మ ప్రచారం కోసం చక్కటి ఏర్పాట్లు చేసిన హిందూ ధర్మ ప్రచార పరిషత్ అధికారులకు అభినందనలు తెలిపారు. ఉత్తరాది భక్తులందరూ శ్రీవారిని నమూనా ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అయోధ్య శ్రీరాముడికి టిటిడి తరఫున తొలిసారిగా పట్టు వస్త్రాలు సమర్పించడం జరిగిందని, ఈ సందర్భంగా సరయూ నదీ తీరంలో స్వామివారికి వైభవంగా నిర్వహించిన స్నపన తిరుమంజనం కార్యక్రమానికి విశేష సంఖ్యలో భక్తులు తరలి వచ్చారని తెలియజేశారు.

# అభివృద్ధిలో దూసుకుపోతున్న చిల్కానగర్ డివిజన్

- చిల్కానగర్ డివిజన్ లో 49 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన : ఎమ్మెల్యే బండారి
- మా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు : కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్



**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి మరియు చిలకానగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ ముఖ్య అతిథులుగా విచ్చేసి చిల్కానగర్ డివిజన్లోని సుమారు 49 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన మరియు ప్రారంభోత్సవం చేశారు. 39 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న బ్యాంక్ కాలనీ మొదటి అంతస్తు సంక్షేమ సంగం భవన నిర్మాణ శంకుస్థాపన. నార్త్ కళ్యాణపురి పార్కులో 10 లక్షల వ్యయంతో ఏర్పాటుచేసిన ఓపెన్ జిమ్ ప్రారంభోత్సవం. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని దశలవారీగా తీర్చుకుంటూ ముందుకు సాగుతున్నామని బ్యాంక్ కాలనీలోని సంక్షేమ సంగం మొదటి అంతస్తు భవనాన్ని నిర్మిస్తామని గతంలో ఇచ్చిన మాట ప్రకారంగా మొదటి అంతస్తు ప్రారంభోత్సవం చేసుకున్నామని తెలిపారు. అదేవిధంగా చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ దంపతులు ప్రతినిత్యం ప్రజలలో ఉంటూ ప్రజాసంక్షేమం కోసం అనునిత్యం పాటుపడుతూ ముందుకు సాగుతున్నారని వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నానని తెలిపారు.



కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ మాట్లాడుతూ.. ప్రతి కాలనీలో బస్తీలో సంక్షేమ సంఘాల బలోపేతం ఎంతో అవసరమని ఈ సంక్షేమ సంఘాల ద్వారానే కాలనీలు అభివృద్ధికి దోహదపడతాయని ప్రభుత్వాలకు ప్రజలకు మధ్య సంక్షేమ సంఘాల పాత్ర ఎంతో ఉంటుందని కొనియాడారు. అదేవిధంగా తమ ఎన్నికలలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని ఒక్కొక్కటిగా తీర్చుకుంటూ ముందుకు సాగుతున్నామని మా గెలుపుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఇలా పనుల ద్వారా రుణం తీర్చుకుంటున్నామని తెలిపారు.

చిల్కానగర్ డివిజన్లో సుమారు 80 కోట్ల నిధులతో ఇప్పటివరకు అభివృద్ధి జరిగిందని చాలా సంతోషంగా ఉందని తెలుపుతూ ముఖ్యంగా ఈ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులకు సహకరిస్తున్న మా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు, టిఆర్ఎస్ పార్టీ నాయకులు ,కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, మహిళా నాయకురాలు, మొదలగువారు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## గ్రామ అభివృద్ధి కి కృషి చేస్తా..

**జయభేరి, ఘట్కేసర్ :**

ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలో విలీనం అయినా గ్రామం ఎదులాబాద్ లో పర్యటించిన ఘట్కేసర్ మున్సిపల్ ఛైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్. ఈ సందర్భంగా ఛైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ.. ఎదులాబాద్ గ్రామలో ఉన్న విధి దీపాలు డ్రైనేజీ, అదేవిధంగా సీసీ రోడ్డుల సమస్యలు స్థానిక నాయకుల ద్వారా తెలుసుకుని పర్యటించడం జరిగిందని, రానున్న రోజుల్లో గ్రామ అభివృద్ధి కి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమం కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు అమర్, సహకార బ్యాంక్ డైరెక్టర్ ఉదయ్ రెడ్డి, సీనియర్ యుగేందర్, వర్క్ ఇన్స్పెక్టర్ మారుతీ, నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడిన వారికి సముచిత స్థానం

- ఎంపీ ఈటల రాజేందర్ ను కలిసిన బిజెపి నాయకులు



**జయభేరి, మేడ్చల్ :**

పార్టీ బలోపేతానికి కష్టపడి పని చేసిన ప్రతిఒక్కరికి సముచిత స్థానం లభిస్తుందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం గుండ్లపోచంపల్లి మున్సిపల్ అధ్యక్షునిగా కావేరి శ్రీధర్ ముదిరాజ్ ఎన్నికైన సందర్భంగా మేడ్చల్ మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ ని మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. అనంతరం మున్సిపాలిటీ అధ్యక్షుడు కావేరి శ్రీధర్ ముదిరాజ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పట్లోళ్ల విక్రమ్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు కృష్ణ గౌడ్, కౌన్సిలర్లు దొడ్ల మల్లికార్జున్, అమరం సరస్వతి, హంసరాణి నాయకులు రవీందర్ గౌడ్, చెంచాల సురేష్, రాజు, బిజెవైయం నాయకులు విక్రమ్, శ్రీకాంత్, అభిలాష్, నరేందర్, యం.నరేందర్, వినోద్ అరుణ్, భాను ప్రకాష్, కే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు ఒరిగిందేమి లేదు

- బీజేపీ కౌన్సిలర్ అమరం సరస్వతి




**జయభేరి, మేడ్చల్ :**

ప్రజలను మబ్బే పెట్టేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో వార్డు, గ్రామ సభలు నిర్వహిస్తుంది తప్ప ఈ సభలతో ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేదని గుండ్లపోచంపల్లి 4వ వార్డు కౌన్సిలర్ అమరం సరస్వతీ మోహన్ రెడ్డి మండిపడ్డారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన వార్డు సభ కార్యక్రమం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిదిలోని పలు వార్డులో నిర్వహించారు. 4వ వార్డులో ఏర్పటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక కౌన్సిలర్ అమరం సరస్వతీ మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల పేరుతో ఎన్నికల్లో నిలిచిన కాంగ్రెస్ ను ప్రజలు నమ్మి ఓట్లేసి కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కి ఇప్పుడు ప్రజలను మోసం చేస్తుందని గుండ్లపోచంపల్లి బీజేపీ కౌన్సిలర్ అమరం సరస్వతి విమర్శించారు. వేల సంఖ్యలో లబ్దిదారులు దరఖాస్తు చేసుకుంటూ పదుల సంఖ్యలో మంజూరి చేస్తూ ప్రభుత్వం ఆర్బాటం చేయడం తప్ప పేద ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. ప్రజలను మభ్యపెట్టకుండా అర్హులందరికి ప్రభుత్వ ఫలాలు అందించాలని డిమాండ్ చేశారు.

## ఘనంగా భ్రమరాంబిక మల్లిఖార్జున స్వామి జాతర

- జాతర వేడుకలు ఘనంగా నిర్వహించడం పట్ల ఆలయ కమిటీ సిబ్బందిని అభినందించిన ఎమ్మెల్యే మల్లారెడ్డి



**జయభేరి, జనవరి 21:**

ముడుచింతలపల్లి మండలం కేశవరం గ్రామంలో శ్రీ భ్రమరాంభిక మల్లిఖార్జున స్వామి దేవాలయం లో జాతర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ వేడుకలకు గ్రామస్తులే కాకుండా పరిసర గ్రామాల ప్రజలు తరలివచ్చి స్వామి వారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇక ఈ జాతర వేడుకల్లో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ సిబ్బంది ఎమ్మెల్యేని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎంతో మహిమ గల మల్లిఖార్జున స్వామిని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. జాతర వేడుకలను ఘనంగా నిర్వహించడం పట్ల ఆలయ కమిటీ సిబ్బందిని ఎమ్మెల్యే అభినందించారు.



## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- మల్టీ లెవెల్ మార్కెటింగ్ ద్వారా సైబర్ వల
- అప్రమాతతే ఆయుధం.. సిద్దిపేట సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఎసిపి జి. శ్రీనివాస్

**జయభేరి, గజ్వేల్, జనవరి 21 :**

గజ్వేల్, జగదేవపూర్, చేర్యాల్, మద్దూర్, సిద్దిపేట పట్టణం ఏరియాలో మీద మల్టీ లెవెల్ -మార్కెటింగ్ ద్వారా ఎక్కువ మొత్తంలో లాభాలు పొందావచ్చు అనే ఒక్క అసత్య ప్రచారం జరుగుతుంది. మల్టీ లెవెల్ మార్కెటింగ్ ద్వారా క్రిప్టో కరెన్సీ, ఆగ్రో గార్మెంట్స్, హెర్బల్ అండ్ హెల్త్, గృహ పరికరాలు వంటి వాటి పైన పెట్టుబడి పెట్టడం ద్వారా ఎక్కువ మొత్తంలో లాభాలు గణించవచ్చు అనే ప్రచారం ద్వారా సైబర్ నేరగాళ్ళు ప్రజలని ఆకర్షిస్తున్నారు. ప్రజలు ఎవ్వరూ కూడా నమ్మవద్దు, మొదటగా సైబర్ నేరగాళ్ళు రకరకాల మయా మాటలతో ఆఫర్స్ పెట్టి ప్రజలనుండి సభ్యత్వాలను స్వీకరించి, వారితో మరికొంతమందిని సభ్యులుగా చేర్పించే ప్రయత్నం చేస్తూ, ఎంత ఎక్కువ మందిని సభ్యులుగా చేర్పిస్తే అంత అధిక మొత్తంలో డబ్బులు తిరిగొస్తాయని ప్రజల్ని నమ్మించి, మభ్యపెట్టి, మొదటగా ఇన్వెస్ట్మెంట్ పెట్టినవారికి చిన్న మొత్తంలో లాభాలు ఇస్తూ, ఈ విధంగా వారిని ఆకర్షిస్తు, వారి ద్వారా ఎక్కువ అధిక రాబడులు, దినసరి ఆదాయం, కమిషనలు ఎక్కువ మొత్తంలో రావడానికి ఇంకా పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టాలని వాళ్ళను మభ్యపెడ్తూ కొత్త కొత్త స్కీమ్ లతో బహిరంగ మార్కెట్లోకి వస్తున్నారు వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇలాంటి వాటిని నియంత్రిచలంటే వాట్సాప్, టెలిగ్రామ్, పేస్ బుక్, ఇంస్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా లో వచ్చే అనుమానిత లింకులను, ఏ పీ కే ఫైల్స్, అప్లికేషన్స్ ను ఎవరు కూడా ఓపెన్ చేయడం కానీ ఇన్స్టాల్ చేయవద్దని, ఇన్వెస్ట్మెంట్, క్రిప్టో కరెన్సీ, మల్టీ లెవెల్ మార్కెటింగ్ కి సంబంధించిన గ్రూపులయందు ఎవరు కూడా సభ్యత్వం కల్గి ఉండకుడదని, ఇలా చేయడం ద్వారా కొంత మేరకు సైబర్ క్రైమ్ కి గురికాకుండ నియంత్రిచగలం అని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏసిపి జి. శ్రీనివాస్ తెలిపారు.

## శ్రీవారిని దర్శించుకున్న సినీ నటులు

**జయభేరి, తిరుమల:**

తిరుమల శ్రీవారిని మంగళవారం రోజు పలువురు సినీ ప్రముఖులు దర్శించుకున్నారు.. ఉదయం నైవేద్య విరామ సమయంలో హీరోయిన్ సంయుక్త మీనన్ , హీరో పూరి ఆకాష్, సింగర్ మంగ్లీ తదితరులు వేరువేరుగా స్వామివారిని దర్శించుకున్నారు.. దర్శనం అనంతరం వారికి ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేయగా పండితులు ఆశీర్వచనాలు అందజేశారు.. స్వామివారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని హీరోయిన్ సంయుక్తా మీనన్ అన్నారు.. దర్శనం అనంతరం సినీ తారలను చూసేందుకు వారితో సెల్ఫీలు దిగేందుకు ఆలయం వెలుపల అభిమానులు ఉత్సాహం చెప్పారు.. ప్రస్తుతం నాలుగు మూవీలు నిర్మాణ దశలో ఉన్నాయని స్వామివారి ఆశీస్సులు కోసం వచ్చినట్లు ఆమె తెలిపారు.

# పేద విద్యార్థిని విద్యార్థులకు సహాయ సహకారాలు

**జయభేరి, ఉప్పల్ :**



మల్కాజిరి పార్లమెంట్ పరిధిలోని ఉప్పల్ నియోజకవర్గంలోని ఉప్పల్ డివిజన్ లో గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో మధుర చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో గవర్నమెంట్ డిగ్రీ విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్, మధుర చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ రాగిడి లక్ష్మారెడ్డి హాజరు కావడం జరిగింది.

ఉప్పల్ డివిజన్లో గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో మధుర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మధుర చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ & చైర్మన్ రాగిడి లక్ష్మారెడ్డి డిగ్రీ కళాశాలలో 37 కంప్యూటర్లు, ఎల్ఈడి స్క్రీన్స్, వైట్ బోర్డ్స్, నోటీస్ బోర్డ్స్, కంప్యూటర్ చేర్స్, కబోర్డ్స్, సిట్టింగ్ చైర్స్, టేబుల్స్ అందజేశారు. రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తాను గత 26 సంవత్సరాల నుండి మధుర చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు తన వంతు సహాయంగా విద్యార్థిని విద్యార్థులకు మధుర చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అన్ని రకాల సేవలను అందజేస్తున్నారు. ఆర్థికంగా పై చదువులు చదవలేని విద్యార్థిని విద్యార్థులకు తమ ట్రస్టు ద్వారా సహాయ సహకారాలు, విదేశీ చదువులు చదువుకునే వారికి ప్రోత్సాహకాలు అందిస్తూ, వారి భవిష్యత్తుకు బాటలు వేయడం జరిగింది అని రాగిడి లక్ష్మారెడ్డి తెలియజేశారు.

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థిని విద్యార్థులకు సహాయ సహకారాలు అందించిన ఘనత మధుర చారిటబుల్ ట్రస్ట్ ది అని ఆయన తెలియజేశారు. రాబోవు రోజుల్లో ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లో గల ప్రభుత్వ పాఠశాలలో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేపడతామని రాగిడి లక్ష్మారెడ్డి తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మధుర చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలకు మాత్రం పథకాలు ఇవ్వడం లేదు

**జయభేరి, ఘట్కేసర్ :**




ఘట్కేసర్ పురపాలక సంఘం 1వ వార్డు కొండాపూర్ కమ్యూనిటీ హాల్లో ప్రభుత్వ ఆదేశానుసారంతో ప్రజా పాలనలో భాగంగా వార్డు సభ నిర్వహించనైనది. ఇట్టి వార్డు సభ సమావేశంలో స్థానిక ప్రజలు ఎంతో ఆశతో వచ్చి తీవ్ర నిరాష పడ్డారు గత సంవత్సరం క్రితం ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు ప్రజలందరికీ గ్యారంటీల పేర్లతో రైతులకు రుణమాఫీ, ఆసరా పెన్షన్లు, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, మహిళలకు మహాలక్ష్మి పథకం కింద 2500 రూపాయలు, అందరికీ 200 యూనిట్లు ఉచిత విద్యుత్, ఇస్తామని ఆశ చూపించి ప్రజల ఓట్లు వేయించుకొని ప్రభుత్వం వచ్చినంక ప్రజా పాలన అని అప్లికేషన్ తీసుకోవడమే కానీ అర్హులైన పేదలకు మాత్రం పథకాలు ఇవ్వడం లేదు. నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయడంలో ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనబడుతుంది. దీనివల్ల ప్రజలందరికి తీవ్ర గందరగోళ పరిస్థితిలు ఏర్పడ్డాయి. ఇక్కడ ఏదో తూతూ మంత్రంగా సెలక్షన్స్ చేసి అర్హులైన పేదలను కూడా గుర్తించలేదు. ఉచిత విద్యుత్తు కొందరికి మాత్రమే వస్తుంది, ఇంక ఈ వార్డులో ఇక్కడ ఎన్ఎఫ్సీ నగర్ అక్కడ కొండాపూర్లలో చాలామంది అప్లికేషన్స్ పెట్టి ఉన్నారు. అసలు ఇదివరకు ప్రజాపాలనలో పెట్టిన అప్లికేషన్స్ ఉన్నాయో లేదో కూడా తెలియదు ఇప్పుడు మళ్ళీ కొత్తగా అప్లై చేసుకోవాలని చెప్తున్నారు. ఇప్పటికైనా అర్హులైన వారందరినీ అధికారులు గుర్తించి వెంటనే వారికి కూడా ఈ పథకాలను అందే విధంగా చూడాలని కోరుతున్నాను. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, 8వ వార్డ్ కౌన్సిలర్ చిలుకూరి హేమలత గోపాల్ రెడ్డి, కమిషనర్ చంద్రశేఖర్, మున్సిపల్ మేనేజర్ వెంకట్ రెడ్డి, ఎస్ఐ ప్రభాకర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు షౌకత్ మియా, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సాయిరాం, వార్డు ఆఫీసర్ మధుసూదన్, నాయకులు ఇమ్మడి యాది రెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ డైరెక్టర్ మశ్చేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ చిలుకూరి గోపాల్ రెడ్డి, పడిగం వెంకటేశ్వరరావు, ప్రజా ప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, వార్డు ప్రజలు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు, మునిసిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# రెండు కుటుంబాలకు ఆర్థిక సాయం చేసిన ఆపన్నహస్త మిత్ర బృందం

✍ జయభేరి, గజ్వేల్, జనవరి 21 :

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం బంగ్ల వెంకటాపూర్ గ్రామంలో రెండు నిరుపేద కుటుంబాలకు ఆపన్నహస్త మిత్ర బృందం ఆర్థిక సహాయం చేశారు. 100 వ కార్యక్రమం బంగ్లా వెంకటపూర్ గ్రామంలోని ఇటీవల ఒక నిరుపేద కుటుంబానికి చెందిన నర్సింలు అనే వ్యక్తి చనిపోవడం జరిగింది. తన భార్య అయినటు వంటి స్వప్నకి కూడా ఆరోగ్యం సహకరించక ఇంటి పట్టునే ఉంటుంది, వృద్ధుడైనటువంటి తన తండ్రిని, సాత్విక అనే చిన్న కుమారుడీని చూసుకుంటూ జీవిస్తుంది, తన ఆరోగ్యం సహకరించక బయటికి వెళ్లలేని పరిస్థితి తండ్రీ కూడా మంచాన పడ్డాడు, వీరికి ఎటువంటి ఆస్తులు లేవు. నిరుపేదలైన వీరికి మా మిత్ర బృందం తరుపున నెలకి సరిపడ కిరాణం, నగదు 11వేలు మొత్తనికి 15 వేల రూపాయల వరకు అందివ్వడం జరిగింది.



101 వ కార్యక్రమం ఇటీవల సోషల్ మీడియాలో బంగ్లా వెంకటాపూర్ లో తల్లి మరణంతో అనాథలైన ముగ్గురు చిన్నారులు అనే కథనం చాలామందికి తెలిసిన విషయమే, వీరికి పలు సంస్థల నుండి ఎంతో స్పందన వచ్చి ఎవరికి తోచిన సహాయం వాళ్ళు చేస్తున్నారు.

ఆపన్నహస్త మిత్ర బృందం తరుపున కూడా వీరికి నగదు రూపంలో ముగ్గురు పిల్లలకు 15 వేల రూపాయలు అందజేయడం జరిగింది. బయట నుండి వచ్చే డబ్బులు పోగు చేసి వీరికి రేపటి భవిష్యత్తు కోసం ఫిక్స్ డిపాజిట్ చేసే ఆలోచనలు ఉన్నారు. కావున మా డబ్బులు కూడా దాంట్లో జమ చేసి ఫిక్స్డ చేయమని చెప్పడం జరిగింది.

ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పాశికంటి బాలచంద్రం, ప్రధాన కార్యదర్శి కటుకం శ్రీనివాస్, సభ్యులు కొలిచెలిమే స్వామి, మంగళ సాయి, శైలజ, సత్యనారాయణ, గిరిబాబు, మల్లేశం, అరవింద్, భాస్కర్ రెడ్డి, అభినవ్ కృష్ణ, రాజు తో పలువురు గ్రామస్తులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.



## బదిర విద్యార్థిని ఉన్నత చదువుకు ప్రభుత్వం అండ

- రూ. లక్ష 40 వేల చెక్కును అందించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థిని కుటుంబ సభ్యులు

✍ జయభేరి, రాజన్న సిరిసిల్ల జిల్లా :

బదిర విద్యార్థిని ఉన్నత విద్యాభ్యాసానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. ఆర్థిక సాయం అందించి భరోసా కల్పించింది. వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి చెందిన దోమకొండ లహరి తండ్రి పోచయ్య. ఈమె కరీంనగర్ జిల్లాలోని బధిరుల పాఠశాలలో 10వ తరగతి వరకు చదివారు. ఉన్నత విద్యాభ్యాసం చేసేందుకు ఆర్థిక స్థోమత లేక ఇంటి వద్దే ఉంటున్నారు. ఈ విషయం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా దృష్టిలోకి వచ్చింది. దీంతో ఆయన ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థి వివరాలు సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించగా, రాష్ట్ర ప్రభుత్వం రూ. లక్ష 40 వేల ఆర్థిక సహాయాన్ని సీఎం ఆర్ఎఫ్ సహాయం కింద పంపింది. మంగళవారం దోమకొండ లహరికి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చెక్కు అందజేశారు. ఉన్నత విద్య అభ్యసించి అనుకున్న లక్ష్యం చేరుకోవాలని ఆకాంక్షించారు.

## దొంగతనం కేసులో మూడు సంవత్సరాలు జైలు శిక్ష



✍ జయభేరి, రాజన్న సిరిసిల్ల జిల్లా :

దొంగతనం కేసులో మూడు సంవత్సరాలు జైలు శిక్షతో పాటు 200/రూపాయల జరిమానా విధిస్తూ సిరిసిల్ల మొదటి ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ మంగళవారం తీర్పు వెల్లడించినట్లు ముస్తాబద్ ఎస్.ఐ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల మేరకు.. తేదీ 5 మే 2024 రోజున ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి గ్రామంలోని పెద్దమ్మ గుడిలో పెద్దమ్మతల్లి యొక్క పుస్తె మట్టెలు దొంగతనం జరిగాయి. ఈ మేరకు తేదీ 5 మే 2024న గ్రామ ముదిరాజ్ కుల సంఘం అధ్యక్షుడు గాడిచర్ల రామచంద్రం ముస్తాబాద్ పోలీస్టేషన్లో ఫిర్యాదు చేయగాఅప్పటి ఎస్సై శేఖర్ రెడ్డి దర్యాప్తు చేసి దొంగతనం చేసిన వేములవాడ మండలం ఫాజిల్ నగర్ గ్రామంకి చెందిన శివరాత్రి సంపత్ ని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. అనంతరం ప్రస్తుత ఎస్సై గణేష్ కోర్టులో చార్జిషీటు దాఖలు చేయగా ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెలిమల సందీప్ వాదించగా కోర్టు సి.ఎం.ఎస్. ఎస్.ఐ. రవీందర్ నాయుడు ,కోర్టు కానిస్టేబుల్ ఆడేపు దేవేందర్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగాకేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్ నిందితుడికి మూడు సంవత్సరాలు జైలు శిక్షతో పాటు 200/ రూపాయల జరిమానా విధించినట్లు ముస్తాబద్ ఎస్.ఐ ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రజా పాలన గ్రామసభ కార్యక్రమం



✍ జయభేరి, సైదాపూర్ :

సైదాపూర్ మండల్ దుద్దెనపల్లి గ్రామంలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా గ్రామసభ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ గ్రామసభలో రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిర ఇండ్లు ఆత్మీయ భరోసా దరఖాస్తులు గ్రామసభలో గ్రామస్తులు చాలా అప్లికేషన్లు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీఓ స్పెషల్ ఆఫీసర్ ఎండి కాజా బషీరుద్దీన్. ఆర్ ఐ వంశీ. గ్రామ కార్యదర్శి రావుల శ్రీనివాస్. ఏఈఓ వరికోలు రాజు, గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ తాళ్ల పెల్లి సతీష్, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగినది.

## 5వ డివిజన్లో ప్రజాపాలన సమావేశం

- అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి
- కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి




✍ జయభేరి, మేడిపల్లి :

తెలంగాణ రాష్ట్రంలో అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 5వ డివిజన్ ఐఐసిటి కమ్యూనిటీ హాల్లో స్థానిక కార్పొరేటర్ సింగరెడ్డి పద్మారెడ్డి ఆధ్వర్యంలో ప్రజా పాలన వార్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ మున్సిపల్ అధికారులు పాల్గొని అర్హులైన వారి నుండి రేషన్ కార్డు ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి మాట్లాడుతూ.. అర్హత ఉన్న ప్రతి ఒక్కరు రేషన్ కార్డు,ఇందిరమ్మ ఇల్లు కోసం మున్సిపల్ కార్యాలయంలో గాని, మీసేవ కేంద్రంలో గాని దరఖాస్తు చేసుకొని అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి విశ్వం గుప్త, సింగిరెడ్డి రాజు రెడ్డి, పబ్బు సత్యనారాయణ, పూర్ణిమ, డివిజన్ నాయకులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తొలి విడతలో స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు

✍ జయభేరి, ఘట్కేసర్:



రెండవ విడత కింద మంగళవారం ఘట్కేసర్ మున్సిపాలిటీలోని 3వ, 6వ వార్డులో ఏర్పాటు చేసిన వార్డు సభలో పాల్గొన్న ఘట్కేసర్ మున్సిపల్ ఛైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, కమిషనర్ చంద్రశేఖర్. ఈ సందర్భంగా ఛైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ గ్రామ, వార్డు సభల్లో కొలిక్కిరానుంది. తొలి విడతలో స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఐతే స్థలం లేని అర్హుల జాబితా ఖరారు చేసే ప్రక్రియ కొన్నాళ్లుగా సాగుతోంది. ప్రజా పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 80 లక్షల మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కేంద్ర పథకానికి అనుగుణంగా రూపొందించిన మొబైల్ యాప్లో దరఖాస్తుదారుల వివరాలు సేకరిస్తున్నారు. గ్రామాల్లో సర్వే ముగిసినా జీహెచ్ఎంసీ వరంగల్, ఖమ్మం వంటి ప్రాంతాల్లో పూర్తి కాలేదు. ఇప్పటి వరకు జరిగిన సర్వే ప్రకారం సుమారు 31 లక్షల మందిని అర్హులుగా గుర్తించారు. వారిలో 18 లక్షల మందికి సొంత ఇంటి స్థలం ఉంటే, సుమారు 12 లక్షల మందికి స్థలం లేదు. స్థలం లేని సుమారు లక్ష మందికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని సర్కార్ భావిస్తోంది. సుమారు 40 లక్షల దరఖాస్తులు ఇంకా పరిశీలన దశలోనే ఉన్నట్లు సమాచారం.

**ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు :** ఇందిరమ్మ ఇండ్ల కోసం గతంలో దరఖాస్తు చేసుకోని వారు నేటి నుంచి గ్రామ, వార్డు సభల్లో ఇవ్వవచ్చని ప్రభుత్వం తెలిపింది. సర్వే పూర్తికానివి కొత్తగా వచ్చే దరఖాస్తులను పరిశీలించిన తర్వాతే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల తుది జాబితా ఖరారు చేసే అవకాశం ఉంది. ఐతే ఈ నెల 26న లాంఛనంగా ఇళ్ల నిర్మాణం ప్రారంభించేందుకు ఎలాంటి అభ్యంతరాలు లేని అర్హులను కొంత మందిని ఎంపిక చేస్తారని తెల్ల రేషన్ కార్డు లేని వారు కూడా విడతల వారిగా అప్లికేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం లో కౌన్సిలర్లు బొక్క సంగీత ప్రభాకర్ రెడ్డి, నస్రీన్ సుల్తానా, కడుపోలా మల్లేష్, కో ఆప్షన్ సభ్యులు బొక్క సురేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్, డీసీసీ కార్యదర్శి ఆంజనేయులు, bjp అధ్యక్షుడు కొమ్మిడి మహిపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ మేడబోయిన వెంకటేష్ ముదిరాజ్, నాయకులు సిరాజ్, బొక్క విష్ణువర్ధన్ రెడ్డి, బొక్క సత్తి రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అధికారులు, నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కోసమేనా సంక్షేమ ఫలాలు

- అర్హులైన ప్రతి పేదవారికి అన్ని పథకాలు అందాలి
- మీ కార్యకర్తకే అందితే మిగతా పేదవారి పరిస్థితి ఏటి

✍ జయభేరి, గజ్వేల్, జనవరి 21 :

అర్హులైన పేద ప్రజలను విస్మరించి కేవలం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు కోసమేనా సంక్షేమ ఫలాలు అంటూ వంటేరు ప్రతాప్ రెడ్డి హేదేవ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నిరుపేదలకు ఇవ్వాల్సిన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రైతు రుణమాఫీ, అర్హులైన పేదల ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు మాత్రమే ఇస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం ప్రారంభమైన గ్రామసభలు కేవలం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కోసమే ఏర్పాటు చేశారని ధ్వజమెత్తారు అసలైన నిరుపేదలకు అన్యాయం చేస్తున్నారని వంటేరు ప్రతాప్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయాలకతీతంగా పార్టీలకతీతంగా సబండ వర్గాలకు న్యాయం చేసే విధంగా ఉండాలే కాని అర్హులైన పేద ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించాలే కానీ పక్షపాత ధోరణితో అధికార బలంతో కేవలం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకుల కోసమేనా సంక్షేమ ఫలాలను అని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నించారు. భూమిలేని ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఎకరానికి 12,000 అందించాలని వారు డిమాండ్ చేశారు. అధికారులు కాంగ్రెస్ ప్రభుత్వానికి కొమ్ముకాస్తున్నారని , కాంగ్రెస్ పార్టీ నాయకుల ఒత్తిడికి తలొగ్గి కాంగ్రెస్ పార్టీ కను సన్నల్లో అవినీతికి అడ్రస్ గా ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు సంక్షేమ ఫలాలను పంచుకునే కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాలలో గ్రామసభలు నిర్వహిస్తే గ్రామసభలు రసాభాసగా జరిగాయన్నారు. కొన్ని గ్రామాలలో గ్రామసభలు విఫలమైనయి అన్నారు, గ్రామాలలోని ప్రజలు గ్రామసభలు అడ్డుకున్నారని గ్రామాలలో కాంగ్రెస్ నాయకులను అధికారులను నిలబెట్టి నిలదీశారని వారు తెలిపారు. ఈ గ్రామసభల ద్వారా మరొక్కసారి స్థానిక సంస్థల ఎన్నికలలో ఓట్లను దండుకోవడం కోసం కొత్త పంతాలో భాగంగా రేషన్ కార్డుల కోసం కొత్త అప్లికేషన్లు తీసుకోవడం కానీ, ఇందిరమ్మ భరోసా కింద కేషన్ తీసుకోవడం కానీ, ఇందిరమ్మ ఇండ్ల కోసం అప్లికేషన్ తీసుకోవడం కానీ ఓట్లను దండుకోవడానికి ఇదొక కొత్త రకమైన మోసమని అన్నారు ప్రజలు వీటిని నమ్మవద్దన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ప్రజలు మోసం చేయడానికి సిద్ధంగా ఉందని వంటేరు ప్రతాపరెడ్డి తెలిపారు. కాంగ్రెస్ నాయకులకు కార్యకర్తలకు మాత్రమే సంక్షేమ ఫలాలు అందిస్తే దానికి పూర్తి బాధ్యత అధికారుల వహించాలన్నారు పేదలకు ఇవ్వాల్సిన సంక్షేమ పాలాలలో ఏమాత్రం రవ్వంత నష్టం జరిగిన చట్టపరంగా అధికారులపై కొట్లాడుతామని చర్యలు తీసుకుంటామని ఏ ఒక్క అధికారిని కూడా వదిలిపెట్టమని వంటేరు ప్రతాప్ రెడ్డి అధికారులను హెచ్చరించారు.


## రసాభాసగా గ్రామసభలు

- గుండ్లపోచంపల్లి వార్డు సభలో పాల్గొన్న తహాశీల్దార్ శైలజ

✍ జయభేరి, మేడ్చల్:



ఇందిరమ్మ ఇళ్లు,రైతు భరోసా, కొత్త రేషన్కార్డులు వంటి ప్రభుత్వ పథకాల లబ్దిదారుల ఎంపికలో భాగంగా మున్సిపాలిటీల్లో, మండలంలోని గ్రామాల్లోని ఏర్పాటు చేసిన వార్డు, గ్రామ సభలు రసాభాసగా మారాయి. మంగళవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని పలు వార్డులతో పాటు మునీరాబాద్, గౌడవెల్లి, మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని పూడూర్, రాయిలాపూర్లో వార్డు సభలతో పాటు మండలంలోని రావల్కోల్ ,సైదోని గడ్డ తండా లో గ్రామసభలు నిర్వహించారు. గుండ్లపోచంపల్లిలోని 1 వార్డు సభలో మేడ్చల్ తహాశీల్దార్ శైలజ, కౌన్సిలర్ రజిత వెంకటేష్, మున్సిపల్ అధికారులు పాల్గొని సమావేశం నిర్వహించారు. గ్రామ సభల్లో మండల, గ్రామ స్థాయి అధికారులు పాల్గొనగా గ్రామ, వార్డు సభల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పలు సమావేశాల్లో అధికారులు కొత్తగా మంజూరైన రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల జాబితాలను ప్రకటించారు. కాగా అధికారులు వెల్లడించిన జాబితాలో, ఆయా పథకాల్లో తమ పేర్లు లేవంటూ లబ్దిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త రేషన్ కార్డులు, పథకాల జాబితాలో అర్హులైన లబ్దిదారుల పేర్లు రాలేవని, ఇళ్లు ఉన్న వారి పేర్లు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో వచ్చాయంటూ అధికారులపై మండిపడ్డారు. అసలైన అర్హులకు ప్రభుత్వ పథకాలు అందడం లేదంటూ ఆందోళన చేయడంతో సభలు రసాభాసా గా మారాయి. అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని, రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేర్లు లేని వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలుపడంతో ఆవేదన వ్యక్తపరుస్తూ తిరిగి దరఖాస్తు చేశారు.




## గ్రామ, వార్డ్ సభలలో ఇల్లు లేని నిరుపేదలు దరఖాస్తూ తీసుకోండి

- మంద సంపత్ సిపిఎం జిల్లా నాయకులు

✍ జయభేరి, హన్మకొండ, జనవరి 21:

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందు వచ్చిన తర్వాత 6 గ్యారంటీలు అమలు చేస్తామని ఇప్పటికీ సంవత్సరకాలం గడుస్తున్నాఇప్పటికీ ఒకటి రెండు గ్యారెంటీలు అమలు మాత్రమే చేసినది. మొదటగా దరఖాస్తులు స్వీకరించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ఇప్పటివరకు మంజూరు చేయలేదు.



అలాగే రేషన్ కార్డులు, అంబేద్కర్ అభయహస్తం లాంటి సంక్షేమ పథకాలు ప్రభుత్వం నుండి ఎలాంటి అధికారులకు ఆదేశాలుగాని సంక్షేమ పథకాల అమలు కానీ జరగడం లేదు. అసెంబ్లీ సమావేశాలలో లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇస్తాము అని బహిరంగ సభలలో ఇందిరమ్మ ఇండ్ల నమూనా చూపెట్టడం వరకే సరిపోతుంది. ఇంతకుముందు రాష్ట్రంలో ప్రతి జిల్లాలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం జరిగి శిథిలావస్థలో ఉన్న ఇప్పటికీ లబ్ధిదారుల ఎంపిక విషయంలో గాని వారికి ఇవ్వడంలో గాని ఎలాంటి ఆదేశాలు జారీ చేయకపోవడం ఇంకా కాలయాపన చేయడం సరైనది కాదు అని, ఇల్లు లేని నిరుపేదలు ఆర్థిక ఇబ్బందులతో ఇండ్ల కిరాయిలు కట్టలేని పరిస్థితి తమ పిల్లలని విద్య, వైద్యం, సరియైన జీవనాన్ని కొనసాగించలేని పరిస్థితుల్లో ఉన్నారని వెంటనే ఇందిరమ్మ ఇండ్లలో స్థలం లేని వారికి 120 గజాల స్థలాన్ని చూపించి ఇంటి నిర్మాణాన్ని చేపట్టి ఇవ్వాలని జిల్లా కలెక్టర్ లకు ఆదేశాలు జారీ చేయాలని అలాగే 6 గ్యారంటీలు అన్నింటిని అమలు జరిగేలా చూడాలని వార్డ్ సభలలో దరఖాస్తులు స్వీకరించి వెంటనే అమలు జరిగేలా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని, జిల్లా అధికార యంత్రాంగాన్ని కోరారు.

## ఆర్యనగరలో డిప్యూటీ మేయర్ పర్యటన

✍ జయభేరి, సికింద్రాబాద్:

తార్నాక డివిజన్ ఆర్య నగర్లో మంగళవారం నాడు గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి, జిహెచ్ఎంసి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ పర్యటనలో బస్తి ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. డిప్యూటీ మేయర్ ఆర్య నగర్లో రోడ్లు, కమిటీ హాల్ నిర్మాణం, స్ట్రీట్ లైట్లు, డ్రైనేజ్ వంటి ప్రధాన సమస్యలను గుర్తించి, వెంటనే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పెండింగ్లో ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరించే దిశగా చొరవ చూపాలని సూచించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ, "తార్నాక డివిజన్ అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటాను. ప్రతిఒక్క బస్తిలో అభివృద్ధి పనులు పూర్తి చేసి, ప్రజలకు మౌలిక సదుపాయాలు అందించడంలో ముందంజలో ఉంటాం" అని తెలిపారు.

# ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూస్తాం


- మున్సిపల్ చైర్మన్

**జయభేరి, పరకాల, జనవరి 21:**

శనివారం పరకాల మున్సిపల్ కార్యాలయంలో జరిగిన మొదటి రోజు ప్రజా పాలన ప్రభుత్వ పథకాల నిర్వాహన సభలు వార్డులు 5,6,7,8,18,19,20 లలో నిర్వహించగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన పరకాల మున్సిపల్ చైర్మన్ సోదా అనిత రామకృష్ణ మాట్లాడు.. తూ ఇందిరమ్మ రాజ్యం ప్రజా పాలన ప్రభుత్వంతోనే సాధ్యమని అన్నారు.

ఈ పథకాలు అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి అందేలా చూస్తామని ఇది నిరంతర ప్రక్రియ అని రేషన్ కార్డుల పేరు లేని వాళ్ళు దరఖాస్తు చేసుకోవాలని వీరికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని ప్రజా పాలన ప్రభుత్వ దరఖాస్తులు స్వీకరించి అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శుష్మ, కౌన్సిలర్స్ దామెర మొగిలి, నల్లెల్ల జ్యోతి అనిల్ కుమార్, గొర్రె స్రవంతి, ఏకు రాజు, పంచగిరి జయమ్మ, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్స్ షబ్బీర్ ఆలీ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కొయ్యడ శ్రీనివాస్, ఇందిరమ్మ కమిటీ మెంబర్స్, ఎం ఆర్ వో వెంకట భాస్కర్, ఆర్ ఐ దామోదర్, అగ్రి కల్చర్ ఏ ఈ వో శైలజ, మున్సిపల్ ఆర్ వో రఘు, మున్సిపల్ ఆర్ ఐ రవి , మెప్మా టీ ఎం సి సతీష్, హెల్త్ డిపార్ట్మెంట్ ఉద్యోగులు , ఆర్ పి లు, వార్డ్ ఆఫీసర్స్ , అలాగే ఏడు వార్డుల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.






## నమ్మి ఓటేస్తే ఫాంహౌజ్ లో ఉండడమేంటి..?

- బిఆర్ఎస్ పాలనలో ఎప్పుడైనా గ్రామ సభలు నిర్వహించారా
- ప్రతాప్ రెడ్డి నీవు కేసీఆర్ ను గజ్వేల్ రమ్మని చెప్పు
- గజ్వేల్ ఎమ్మెల్యేగా కేసీఆర్ ఇక్కడి సమస్యలు పరిష్కరించాలి
- ప్రజలకు అందుబాటులో ఉండకుండా సదుపాయాలు పొందుతున్న కేసీఆర్
- గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్

**జయభేరి, గజ్వేల్, జనవరి 21 :**

గజ్వేల్ ప్రజలు ప్రతాప్ రెడ్డి నీ ఛీకొట్టినప్పటికీ అతనిలో మార్పు రాలేదని, స్వయం ప్రకటిత నేతగా ప్రతిరోజు గజ్వేల్ బిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జినని చెప్పుకుంటూ కాంగ్రెస్ పార్టీని విమర్శించ డంలో అర్థం లేదని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ విమర్శించారు. మంగళవారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రతాప్ రెడ్డి ఏ పార్టీలో అడుగుపెడితే ఆ పార్టీ భూస్థాపితం అవుతుందని, గతంలో జరిగిన సంఘటనలు ఆయన గుర్తు చేశారు. ముఖ్యంగా గజ్వేల్ ప్రజలు కేసీఆర్ కు నమ్మి ఓటేస్తే పత్తా లేకుండా పోయిన ట్లు ఎద్దేవా చేశారు. ఇక్కడి సమస్యలు పరిష్కరించాల్సిన కేసీఆర్ ఫాంహౌజ్ కే పరిమితం కాగా, ఎలాంటి అర్హత లేని ప్రతాప్ రెడ్డి ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ లో కూర్చొని రాష్ట్ర అభివృద్ధిని జీర్ణించుకో లేక కాంగ్రెస్ ను విమర్శించడం నిత్య కృత్యమైందని ఆరోపించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ గజ్వేల్ ఒరగబెట్టిందే మీ లేదని, కేవలం కమిషన్ల కోసమే భవనాలు రోడ్లు నిర్మించి పేదల సంక్షేమాన్ని పక్కన పెట్టినట్లు చెప్పారు. పేదలు గత పదేండ్లుగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం ఎదురుచూస్తుండగా, మున్సిపల్ పై అధికారం, పెత్తనం కోసం లాటరీ పద్ధతిలో కేటాయించి కూడా ఇండ్లు ఇవ్వలేదని దుస్థితిలో ఉండగా ఇందుకు ప్రతాప్ రెడ్డి ప్రదాన కారకుడని తెలిపారు. అంతేకాకుండా రోడ్డు విస్తరణలో ఇండ్లు కోల్పోయినప్పటికి బాధితులను ఆదుకున్న పాపాన పోని హరీష్ రావు, ప్రతాపరెడ్డి ఏ ముఖం పెట్టుకొని మాట్లాడుతున్నారని నిలదీ శారు. గజ్వేల్ ను అన్ని రకాల దోచుకున్న ఈ నేతలు స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే విమర్శలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఏడాది దాటినా ప్రజల్లోకిరాని కెసిఆర్ ప్రభుత్వ సదుపాయాలు పొందుతుండగా, దమ్ముంటే ఆయనను బయటకు రప్పించాల ని డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అవినీతి, అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతుండడంతో ఆత్మ రక్షణలో పడి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే వారు జైలుకెళ్లడం ఖాయమని, పద్ధతి మార్చుకొని పక్షంలో త్వర లోనే ప్రతాప్ రెడ్డి అవినీతి, అక్రమాల బండారం బయటపెడతా మని వివరించారు.

## గాగిల్లాపురం లో గ్రామసభ నిర్వహణ కార్యక్రమం

**జయభేరి, చందంపేట :**

చందంపేట మండలం గాగిల్లాపురం గ్రామంలో ప్రజా పాలన గ్రామ సభ నిర్వహణ కార్యక్రమం ప్రజల మధ్యలో గ్రామ సెక్రె టరీ ఆధ్వర్యంలో నిర్వహించినారు గ్రామంలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, గృహ జ్యోతి రానివారికి, అప్లై చేసుకోవచ్చు అని అప్లై చేసుకున్న వారి పేర్లు చదివి వినిపించారు పేర్లు రానివారు మళ్ళీ అప్లై చేసుకోవచ్చు అని సెక్రటరీ తెలియజేసి నారు, మాజీ ఎంపిటిసి తంగెళ్ల రామకృష్ణారెడ్డి ఈ కార్యక్రమం నిరంతరం ఉంటుంది పేర్లు రాణి మళ్ళీ అప్లై చేసుకోవాలని తెలి యజేసినారు ఈ కార్యక్రమంలో సి ఎస్ చైర్మన్ కొండ్ర శ్రీశైలం యాదవ్, మాజీ సర్పంచ్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి

**జయభేరి, ఘట్కేసర్ :**

పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడ LIG కలని రాజీవ్ గృహకల్ప యంనం పేట్, ఇస్మాయిల్ కన్ గూడ లలో దాదాపు 1కోటి 86లక్షలతో పలు అభివృద్ధి పనులు శంకు స్థాపనలు చేసిన మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి. మంగళవారం నాడు పోచారం మున్సిపల్ పరిధిలోని పలు వర్డు లలో అభివృ ద్ధి కార్యక్రమాలు మున్సిపల్ సాదరణ నిధులు దాదాపు 1కోటి 66 లక్షల 93 వేలతో మూడవ వార్డు లో LIG కలని లో డ్రైనేజీ పనుల ప్రారం భోత్సవం. ఆరవ వార్డు రాజీవ్ గృహకల్ప లో సీసీ రోడ్డు పనుల ప్రారంభోత్సవం. తొమ్మిదవ వార్డు రాజీవ్ గృహకల్ప లో వార్డు కార్యాల యం, సీసీ రోడ్డు ప్రారంభోత్సవం.

యంనంపేట్ సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ ప్రా రంభోత్సవం ఇస్మాయిల్ కన్ గూడ బీటీ రోడ్డు మరియు సీసీ రోడ్ల ప్రారంభోత్సవ చేసారు. ఎంపి లాడ్స్ నిధులు 20 లక్షలు ఇస్మాయిల్ కన్ గూడలో సీసీ రోడ్డు భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. మొత్తము 1కోటి 86 లక్షలతో అభివ్రుద్ధి పనుల శంకుస్థాపనలు ప్రా రంభోత్సవాలు చేశారు.

ఈ కార్యక్రమంలో చైర్మన్, వైస్ చైర్మన్ రెడ్డియా నాయక్, కమీషనర్ వీరా రెడ్డి, కౌన్సిలర్లు గొంగళ్ళా మహేష్, నర్రి దానలక్ష్మి కషయ్య, చింతల రాజశేఖర్, సింగిరెడ్డి సాయిరెడ్డి, అకిటి శైలజ బల్ రెడ్డి, మెట్టు బల్ రెడ్డి, బెజ్జంకి హారిప్ర సాద్ రావు, సామల శ్రీలత బుచ్చిరెడ్డి, అబ్బవతి నీ సరిత, మోటు పల్లి పోచమ్మ శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యులు అక్రమ్ అలీ, దాసరి శంకర్, నాయకులు బద్దం జగన్ మోహన్ రెడ్డి, అబ్బ వతినీ నర్సింహా, మున్సిపల్ సిబ్బంది వివిధ పార్టీల నాయకులు వివిధ కలని వాసులు తది తరులు పాల్గొన్నారు.



## ప్రజలందరికీ సక్రమంగా సంక్షేమ పథకాలు

- అందజేయాలని ఆర్డీవో కి వినతిపత్రం

**జయభేరి, దేవరకొండ :**

భారతీయ జనతా పార్టీ దేవరకొండ బిజెపి మున్సిపాలిటీ అధ్యక్షులు వస్కుల సుధాకర్ ఆధ్వర్యంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయాలని RDO గారికి వినతిపత్రం ఇవ్వటం జరిగింది. ఇట్టి కార్యక్ర మాన్ని ఉద్దేశించి బిజెపి దేవరకొండ నియోజ కవర్గం అసెంబ్లీ కన్వీనర్ AT .కృష్ణ మాట్లా డుతూ అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, మంజూరు చేయాలని, రైతు లందరికీ రైతుబంధు ఇవ్వాలని అలాగే కౌలు రైతులు అందరికీ కూడా ప్రభుత్వం హామీ ఇచ్చి నట్లుగా సంవత్సరానికి 12000 రూపాయలు ఇవ్వాలని,కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు చెప్పినటువంటి ఆరు గ్యారెంటీలు సక్రమంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న స్థానిక ఎలక్షన్ల లో గ్రామ గ్రామాన కాంగ్రెస్ లీడర్లని నిలదీస్తా మని ప్రభుత్వాన్ని హెచ్చరించడం జరిగింది ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు బెజవాడ శేఖర్, నక్క వెంకటేష్ యాదవ్, ఉప్పల వెంకటేష్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకురి నరసింహ, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవ ర్గ సభ్యులు నేతాల వెంకటేష్, మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు నా రోజు పద్మ, జల్దా భాస్కర్, సముద్రాల సహదేవ్ (దేవరకొండ వాసవి క్లబ్ అధ్యక్షులు), పబ్బు సైదులు, నారాయణదాసు చండీశ్వర్, చిత్రాల నాగేంద్ర, పోలగొని గణేష్, చిలక రాజు బిక్కు, ఇరుగదిండ్ల శ్రీను, శిరమౌని మహేష్, నీల సుమన్, జిల్లా మల్లేష్, పున్న వెంకటేష్ నేత, తిరుపతి గౌడ్, బిక్షపతి జాదవ్, శేఖర్ రెడ్డి, రాము, తదితరులు పాల్గొన్నారు.



## రచయితలు సామాజిక స్పృహతో రచనలు చేస్తారు

- రచయితలు సామాజిక స్పృహతో రచనలు చేస్తారు.
- పుస్తకావిష్కరణ లో ఎమ్మెల్యే బాలునాయక్

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలోని శాఖ గ్రంథాలయం లో మంగళవారం కవి, ఆర్టిస్ట్ సఖీలినేని జీవ రాసిన బాలానందం కవితా సంపుటిన శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్ ఆవిష్కరిం చారు. ఈ సందర్భం వారు మాట్లాడుతూ రచ యితలు ఎంతో సామాజిక స్పృహతో రచనలు చేస్తారని అవి సమాజానికి మేల్కొల్పేవిధంగా దోహదపడతాయని,రచనలు ఎంతో స్ఫూర్తి దాయాకమని అని అన్నారు.

కవి, రచయిత సకిలినేని జీవ రాసిన బాలానందం కవితా సంపుటి చిన్నారలకి, మానసిక ఆహ్లాదాన్ని అందిస్తాయని అన్నారు. రచయిత కృషిని కొనియాడుతూ సన్మానం చేసి మరిన్ని రచనలు చేయాల్సిందిగా ప్రోత్సహిం చారు. ఈ పుస్తకావిష్కరణ సభకి తెస్సా అధ్య క్షులు పర్చ వాసుదేవారావు అధ్యక్షత వహించి ఎమ్మెల్యే కి శాలువాతో సత్కరించారు. మున్సి పల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ కోఆర్డినేటర్ సిరాజ ఖాన్ మాజీ మున్సిపల్ చైర్మన్ వడ్త్య దేవేందర్ నాయక్, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ వెంక టయగౌడ్, టౌన్ ప్రెసిడెంట్ యూనుస్ బి. సి. సంక్షేమసంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్ గౌడ్, పోటీ పరీక్షలకు పాల్గొనే విద్యా ర్థులు పాల్గొన్నారు.




## బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు ఆటల పోటీలు

- ముఖ్య అతిథి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ ప్రియాంక

**జయభేరి, గజ్వేల్, జనవరి 21 :**

గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీచెన్ రాజ్ పండరి ఆధ్వర్యంలో గజ్వేల్ న్యాయవా దులకు మంగళవారం ఆటల పోటీలు నిర్వ హించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ ప్రియాంక చెస్, క్యారం ఆటలను ఆడి ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ ప్రియాంక మాట్లాడుతూ న్యాయవాదులు ఎప్పుడు కేసులు వాదిస్తుంటా రు కాబట్టి సంవత్సరానికి ఒకసారైనా ఇలా అందరూ న్యాయవాదులు కలిసి చెస్, క్రికెట్, వాలీబాల్, షటిల్, క్యారం లాంటి ఆటలు ఆడటం వల్ల మానసికంగా ఉత్సాహన్నిస్తా యి అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ సెక్రెటరీ కనకయ్య, జాయింట్ సెక్రటరీ కరు ణాకర్, సీనియర్ న్యాయవాదులు వి.శ్రీనివాస్, బాలముకుందరెడ్డి, వి వి రమణ, హరిశంకర్, వనం భాస్కర్, కిరణ్ సాగర రావు, సుదర్శన్, ఎల్లం, బి. భాస్కర్, అశోక్, ఇర్ఫాన్, రామకృష్ణ, స్వామి, మరికొంత మంది న్యాయవాదులు పాల్గొన్నారు.





## పథకాలు ప్రతి ఒక్క పేదవాడికి అందేలా చూడాలని

**జయభేరి, ఘట్కేసర్ :**

పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడ 5వ వార్డు ST కమ్యూనిటి హల్ లో జరిగిన వార్డు సభ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి. మంగళవారం పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడ 5వ వార్డు ST కమ్యూనిటి హల్ లో జరిగిన వార్డు సభ కార్యక్రమంలో పాల్గొన్నరు. వారు మా ట్లాడుతూ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళు, పలు పథకాలు ప్రతి ఒక్క పేదవాడికి అందేలా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే అన్నీ వార్డులలో వార్డు సభ మున్సిపల్ నుండి అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రజలందరూ వార్డు సభలను వినియోగించుకొని అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్య క్రమంలో చైర్మన్, వైస్ చైర్మన్ రెడ్డియా నాయక్, కమీషనర్ వీరా రెడ్డి, మేనేజర్ ఆంజన్ రెడ్డి, బద్దం జగన్ మోహన్ రెడ్డి, సింగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, శేఖర్, మున్సిపల్ అధికారులు ఇందిరమ్మ కమిటి సభ్యులు లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

## అనాథలను ఆదుకోవాలని విజ్ఞప్తి

- అనాథల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకున్న నాయకులు అఫ్జల్ ఖాన్



**జయభేరి, జనవరి 21:**

సేవ లోనే సంతోషం దాగి ఉంటుందని నాయకులు అఫ్జల్ ఖాన్ అన్నారు. మేడ్చల్ జిల్లా తుర్కపల్లి లోని సేవ్ ఆల్ రీచ్ ఆల్ అనాథ ఆశ్రమంలో అనాథ పిల్లల మధ్య తన జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అనాథ పిల్లలకు పండ్లు , చాక్లెట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మానవతా దృక్పథంతో అనాథలను ఆదుకోవాలని కోరారు. ప్రస్తుతం సంపాదనే ధ్యేయంగా సేవా భావాన్ని గాలికి వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తన జన్మదినోత్సవాన్ని అనాథల మధ్య జరుకోవడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ఉపాధ్యాయులు పి. నర్సింహా రెడ్డి, మహ్మద్ అజ్మత్, రాజు, ఆశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ భూములకు రక్షణ కల్పించండి

- ఎమ్మార్వో కు వినతి పత్రం అందజేస్తున్న వర్గల్ గ్రామస్తులు



**జయభేరి, వర్గల్, జనవరి 21 :**

దళారులను నమ్మి కొంతమంది రైతులు దేవాలయ భూములను రైతులు అమ్మే ప్రయత్నం చేస్తున్నారని వర్గల్ గ్రామ ప్రజలు ఎమ్మార్వోకు వినతి పత్రం అందజే శారు. సిద్దిపేట జిల్లా వర్గల్ కేంద్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయానికి సంబంధించిన భూములను కొంతమంది రైతులు సాగు చేసుకుంటున్నారు. ప్రస్తుతం అందులో కొందరు రైతులు దళారులతో కలిసి దేవాలయ భూమిని అమ్మే ప్రయత్నం చేస్తున్నారని గ్రామ ప్రజల దృష్టికి రావడంతో వర్గల్ ఎమ్మార్వో బాలరాజ్ కు దేవాలయ భూములకు రక్షణ కల్పించాలంటూ వినతి పత్రం అం దజేశారు. అలాగే దేవాలయ భూమిలకు సంబంధించిన 16 సర్వే నెంబర్ లలో గల 46.06 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్లు ఆపాలని వారికి వినిపించారు.

## అహ్మదీపూర్ గ్రామంలో గ్రామసభ ప్రశాంతం



**జయభేరి, గజ్వేల్, జనవరి 21 :**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామంలో ప్రజాపాలన గ్రామ సభ ను స్పెషల్ ఆఫీసర్ కే. శ్రవణ్ కుమార్ ,పంచాయతీ సెక్రెటరీ కుమారస్వామి ఆధ్వర్యంలో నిర్వహించబడినది. ఈ సందర్భంగా ఎమ్మార్వో శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ నూతనంగా, వచ్చిన రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల కోసం, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, సభలో తెలపడం జరిగినది. రేషన్ కార్డులు రానివారు ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారు వారి పేర్లు రాకుంటే అధికారులకు మరొక దరఖాస్తు ఫారాని నింపి, ఇవ్వాలని అన్నారు. ఎవరు కూడా బాధపడవద్దని అర్హులైన వారికి అందరికీ రావడం జరుగుతుంది. మోసం జరగదని అర్హులైన వారికి అన్ని పథకాలు అందించేలా కృషి చేస్తాం అని అన్నారు. నాలుగు స్కీములకు నేటి నుంచి అప్లికేషన్లు 24 దాకా తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే వచ్చిన లిస్టుల్లో పేరులేని వాళ్లు దరఖాస్తు చేసుకునే చాన్స్ ఉన్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో గజ్వేల్ సిఐ సైదా, ఏపీఓ, సురేందర్, ఏ ఈ ఓ, అనుష, ఆర్ ఐ సంతోష్, టెక్నికల్ అసి స్టెంట్ నరేష్,అంగన్వాడి టీచర్లు, ఐకెపి, పుష్పలత ,గ్రామ యువకులు కాంగ్రెస్ నాయకులు, టిఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ గ్రామ నూతన కమిటీ ఎన్నిక

**జయభేరి, గజ్వేల్, జనవరి 21 :**

ఎస్సీ వర్గీకరణ అమలు కోసం మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో ఫిబ్రవరి 7న హైద్రాబాద్లో జరిగే వెయ్యి గొంతులు.. లక్ష డప్పులు సాంస్కృతిక మహా ప్రదర్శన కార్యక్రమానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో మంగళవారం వర్గల్ మండలం మి నాజీపేట్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ నియమించారు. ఈ కార్యక్ర మానికి డ్యాగ నవీన్ కుమార్, మండల ఎమ్మార్పీఎస్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మూవీభేరి

## హాలీవుడ్ లో బంఫర్ ఆఫర్ పట్టేసిన
# ప్రభాస్ బ్యూటీ

బాలీవుడ్ బ్యూటీ దిశా పటాని గురించి ప్రత్యేక పరిచయాలు అవసరం లేదు.. తెలుగు ప్రేక్షకులకు ఈమె సుపరిచితమే. మెగా హీరో వరుణ్ తేజ్ తో కలిసి లోఫర్ సినిమాలో నటించింది. ఆ సినిమాలో ఈమె నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఆ తర్వాత బాలీవుడ్ లో ఎక్కువగా సినిమాలు చేస్తూ బిజీగా ఉంది రీసెంట్గా గత ఏడాది రిలీజ్ అయిన బ్లాక్ బస్టర్ హిట్ మూవీ కల్కిలో ప్రభాస్ సరసన జోడిగా నటించింది. కోట్లలో పారితోషికం అందుకుంది. తదుపరి కల్కి 2లోను తన పాత్రకు స్కోప్ ఉంటుంది. మరో పాన్ ఇండియా చిత్రం కంగువతో అభిమానుల ముందుకు వచ్చింది. కానీ ఆ మూవీ అనుకున్న హిట్ టాక్ అయితే అందుకోలేకపోయింది.. ఆ తర్వాత తెలుగులో ఒక్క సినిమా కూడా అనౌన్స్ చేయలేదు. కానీ ఇప్పుడు ఈ బ్యూటీ గురించి ఓ క్రేజీ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.. బాలీవుడ్ హాట్ బ్యూటీ దిశా పటాని భాషతో పని లేకుండా ప్రతి ఇండస్ట్రీలోనూ వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుంటూ సినిమాలు చేసుకుంటూ పోతుంది. సినిమాలు తోనే కాదు సోషల్ మీడియాలో కూడా ఈ పాప యాక్టివ్గా ఉంటూ తన లేటెస్ట్ ఫోటోల తో కుర్రకారికి నిద్రలేకుండా చేస్తుంది. తన హాట్ లుక్స్ తో యూత్ లో మంచి క్రేజ్ సంపాదించుకుంది.. ఎలాంటి చిన్న పోస్ట్ పెట్టిన కూడా నిమిషంలో లక్షల్లో లైక్ లు, కామెంట్ లు వస్తాయి.. ఇప్పటివరకు దిశ పటాన్ని చేసిందే తక్కువ సినిమాలైనా మంచి క్రేజ్ను అందుకుంది.. బాలీవుడ్ స్టార్ హీరోయిన్లకు గట్టి పోటి ఇస్తుంది. ఇక ఇప్పుడు హాలివుడ్ లోకి ఎంట్రీ ఇస్తోందట దిశా..





# ఇచ్చుకుందాం బేబీ..

విశ్వక్‌సేన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'లైలా'. రామ్ నారాయణ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సాహు గారపాటి నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలో 'ఇచ్చుకుందాం బేబీ..' అంటూ సాగే రెండో గీతాన్ని ఈ నెల 23న విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా మంగళవారం సాంగ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. లియోన్ జేమ్స్ సంగీతంలో రొమాంటిక్ గీతంగా ఆకట్టుకుంటుందని, నాయకానాయికల మధ్య కెమిస్ట్రీ ప్రధానాకర్షణగా నిలుస్తుందని చిత్రబృందం పేర్కొంది. ఈ సినిమాలో విశ్వక్‌సేన్ బ్యూటీ పార్లర్ నడిపించే మోడల్ సోనూగా, లైలా అనే అమ్మాయిగా రెండు పాత్రల్లో కనిపించనున్నారు. ఇటీవల విడుదల చేసిన టీజర్‌కు మంచి స్పందన లభించిందని, రొమాన్స్, యాక్షన్, కామెడీ అంశాలతో ఈ సినిమా మెప్పిస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్, రచన: వాసుదేవ మూర్తి, దర్శకత్వం: రామ్ నారాయణ్.

# ఏసుబాయిగా రష్మిక మందన్నా..

పుష్ప ఫ్రాంఛైజీ ప్రాజెక్ట్ తో నేషనల్ క్రష్‌గా మారిపోయింది కన్నడ సోయగం రష్మిక మందన్న). గ్లామరస్ పాత్రలతో నటనకు ఆస్కారమున్న రోల్స్‌లో నటిస్తూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తుంటుంది రష్మిక. ఈ భామ ఖాతాలో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు లైన్‌లో ఉన్నాయి. ఈ భామ నటిస్తోన్న సినిమాల్లో ఒకటి Chhava. మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ జీవిత కథ ఆధారంగా వస్తోన్న ఈ మూవీకి లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రంలో విక్కీ కౌశల్ టైటిల్ రోల్‌లో నటిస్తుండగా.. ఇందులో రష్మిక ఛత్రపతి శివాజి సతీమణి మహారాణి ఏసుబాయిగా నటిస్తోంది. ఈ మూవీని ఫిబ్రవరి 14న విడుదల చేయబోతున్నారు. ప్రతి గొప్ప రాజు వెనుక అసమానమైన బలం కలిగిన రాణి ఉంటుంది. స్వరాజ్యం గర్వపడే మహారాణి యేసుబాయి.. అని ట్వీట్ చేస్తూ తన పాత్ర లుక్‌ను షేర్ చేసింది రష్మిక మందన్నా. ఈ మూవీ ట్రైలర్ రేపు లాంచ్ చేయనున్నట్టు ప్రకటించింది. ఇందులో రష్మిక పాత్ర చాలా పవర్ ఫుల్‌గా ఉండబోతుందని తాజా లుక్ చెప్పకనే చెబుతోంది. కథానుగుణంగా సినిమా పూర్తిగా మరాఠీ భాషలో సాగనుందని బీటౌన్ సర్కిల్ టాక్. ఈ నేపథ్యంలో రష్మిక మరాఠీ భాష నేర్చుకుందని ఇప్పటికే వార్తలు కూడా వచ్చాయి. మ్యాడ్‌డాక్ ఫిలిమ్స్ బ్యానర్‌పై వస్తోన్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నాడు.




Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com